వీలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492

www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక



హైదరాబాద్ | సంచిక : 1 | సంపుటి : 162 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | నవంబర్ 2024 | వెల : రూ 10/-



## రాజ్యాంగ ప్రవేశికపై సుప్రీం కీలక తీర్పు

ప్రవేశికలో లౌకిక, సామ్యవాద పదాలు తొలింపు పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ,
రాజ్యాంగ ప్రవేశిక అంశంపై సోమవారం సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. ప్రవేశికలో లౌకిక, సామ్యవాద పదాలు తొలగించాలని దాఖలైన పిటిషన్లను తాజాగా కొట్టివేసింది. సుప్రీం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌తో కూడిన ధర్మాసనం ఈ తీర్పు

-మిగతా 3 లో



## ఢిల్లీకి ఎన్నిమార్లయినా
# వెళుతూనే ఉంటాం

- స్కిల్ యూనివర్సిటీ విరాళం వందకోట్లు వెనక్కి
- ఆదానీ డబ్బులు తీసుకోరాదని నిర్ణయం
- కేటీఆర్ జైలుకెళ్లడానికి తహతహలాడుతున్నారని ఎద్దేవా
- విమర్శల నేపథ్యంలో సీఎం రేవంత్ ప్రకటన

హైదరాబాద్,
అదానీ గ్రూప్‌పై లంచాల విమర్శల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి ఇటీవల అదానీ గ్రూప్ ప్రకటించిన రూ. 100 కోట్ల విరాళాన్ని స్వీకరించరాదని నిర్ణయించింది. ఈ విషయాన్ని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మీడియా సమావేశంలో వెల్లడించారు. ఆ గ్రూప్‌పై విమర్శల దృష్ట్యా అదానీ ఫౌండేషన్ నుంచి విరాళాన్ని తీసుకోవడం లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆ అదానీ గ్రూపునకు లేఖ పంపినట్లు సీఎం వెల్లడించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త

-మిగతా 3 లో



## 12,400 కోట్ల ఒప్పందాల
# సంగతేంటి..?


- అదానీకి రాష్ట్రంలోని డిస్కంలను అప్పగించే ప్లాన్!
- ప్రైవేటీకరించేందుకు మీరు చేస్తున్న కుట్రల మాటేమిటి..?
- అదానీతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలన్నింటినీ రద్దు చేయాలి
- మాజీ మంత్రి , బిఆర్ఎస్ నేత హరీష్ రావు డిమాండ్

హైదరాబాద్,
సీఎం తీసుకున్న ఈ నిర్ణయం పై మాజీ మంత్రి , బిఆర్ఎస్ నేత హరీష్ రావు స్పందించారు. స్కిల్ యూనివర్సిటీకి ఇచ్చిన 100 కోట్లు నిధులు వెనక్కి తీసుకున్నారు సరే.. అదానీ అవినీతిపై రాహుల్ గాంధీ జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాలని నినదిస్తున్న సమయంలో

-మిగతా 3 లో


## ప్రైవేట్ రంగంలో ప్రాజెక్టులు, రోడ్లు

- నిర్మాన నిర్వహణ ఇక సులభతరం
- టోల్ వసూలుతో నిర్వహణా భారం
- ఎపిలో ప్రయోగాత్మక అమలుకు నిర్ణయం




అమరావతి,
తెలుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు పబ్లిక్,ప్రైవేటు పార్టనర్ షిప్ గురించి ఇటీవలి కాలంలో బాగా ఫోకస్ పెడుతున్నారు. శీఘ్రగతిన అభివృద్ధితో పాటు,ప్రజల భాగస్వామ్యం ఉండేలా చూస్తున్నారు. ఇప్పటి వరకూ ఈ మోడల్ కొన్ని విభాగాల్లో అమలు చేస్తున్నారు. జాతీయ రహదారుల తరహాలో రాష్ట్ర, జిల్లా

-మిగతా 3 లో




## ముగిసిన జేఈఈ దరఖాస్తు గడువు

- 3.8 లక్షల మందికి పైగా దరఖాస్తు
- జనవరి 22 నుంచి జేఈఈ మొదటి సెషన్ పరీక్షలు

న్యూఢిల్లీ,
దేశవ్యాప్తంగా ఉన్న ఎన్ఐటీలు, ట్రిపుల్ఐటీల్లో బీటెక్, బీఆర్క్ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) 2025 జనవరి సెషన్ దరఖాస్తు ప్రక్రియ ముగిసింది. గడువు సమయం ముగిసే నాటికి సుమారు 13.8 లక్షల మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. అక్టోబర్

-మిగతా 3 లో

## మనమంతా కలసికట్టుగా
# ముందుకు సాగాలి



- ప్రజల సమస్యలు ఎజెండా చర్చించాలి
- కొత్త ఏడాదిలోకి అడుగిడుగుతున్న తరుణం
- రాజ్యాంగం ఆవిర్భవించి నేటికి 75 ఏళ్లు
- సంవిధాన్ సదన్‌లో నేడు రాజ్యాంగ దినోత్సవం
- పార్లమెంట్ సమావేశాల నేపత్యంలో ప్రధాని మోడీ

న్యూఢిల్లీ,
ప్రజలతో తిరస్కరణకు గురైన వారు పార్లమెంట్‌ను నియత్రించే పనిలో ఉన్నారని ప్రధాని మోడీ అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వారి సమస్యలపై చర్చకు అంతా సిద్దంగా ఉండాలని, ప్రభుత్వం అందుకు సంసిద్దంగా ఉందన్నారు. శీతాకాల సమావేశాల ప్రారంభానికి ముందు పార్లమెంట్ వెలుపల మీడియా పాయింట్ వద్ద ప్రధాని నరేంద్రమోదీ మాట్లాడారు. పార్లమెంట్‌లో ఫలవంతమైన చర్చలు

-మిగతా 3 లో



## బీజేపీ బాధ్యత వహించాలి

-అధికారంతో హిందూ, ముస్లింల మధ్య గొడవ
- యూపీ ప్రభుత్వ తీరు చాలా దురదృష్టకరం
-సంభాల్ ఘర్షణపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్

న్యూఢిల్లీ
యూపీలోని సంభాల్‌లో చోటు చేసుకున్న హింసాత్మక పరిస్థితులపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ స్పందించారు. అధికారాన్ని ఉపయోగించి హిందూ, ముస్లింల మధ్య బీజేపీ సృష్టిస్తున్న గొడవ దేశ, రాష్ట్ర ప్రయోజనాల కోసం

-మిగతా 3 లో



## సీఎం రేవంత్‌రెడ్డికి రోజులు దగ్గరపడ్డాయ్

- మహారాష్ట్రలో తగిన బుద్ధి చెప్పారు
- రాళ్లలో కొడతామంటే పోలీసులు ఏం చేస్తున్నారు
- బీఆర్ఎస్ మీదే కేసులా... కాంగ్రెస్ మీద కేసులుండవా.?
- మహబూబాబాద్ మహాధర్నాలో మాజీ మంత్రి కేటీఆర్ ధ్వజం

హైదరాబాద్,
అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన సీఎం రేవంత్‌రెడ్డికి రోజులు దగ్గర పడ్డాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గిరిజన, దళిత, పేద రైతులకు మద్దతుగా మహబూబాబాద్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మహాధర్నాలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. మహారాష్ట్రకు పోయి కూడా ఆడబిడ్డలను మోసం చేసే ప్రయత్నం చేస్తే అక్కడి ఆడబిడ్డలు బుద్ధి చెప్పారని తెలిపారు. వీడు పచ్చి లంగా, తెలంగాణలో ఆడబిడ్డలను మోసం చేశాడని చైతన్యం ప్రదర్శించి తన్ని తన్ని తరిమేశారని పేర్కొన్నారు. నేను ఇక్కడ వస్తుంటే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాళ్లతో కొడతమని అంటున్నారని కేటీఆర్ తెలిపారు.

-మిగతా 3 లో

## విద్యార్థులపై కక్షకట్టిన చంద్రబాబు



- విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోంది
- కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లో తిరోగమనం
- విద్యారంగాన్ని దారుణంగా దెబ్బతీశారు
- 11 లక్షల మంది విద్యార్థులకు ఇబ్బంది
- 12,609 కోట్లు ఒక్క విద్యాదీవెనకే ఖర్చు చేశాం
- ఎన్నికల కోడ్ కారణంగా ఇవ్వలేకపోయాం
- డిసెంబర్ నాటికి 3500 కోట్ల బకాయిలు
- ప్రభుత్వంపై ట్విట్టర్ వేదికగా వైఎస్ జగన్ విమర్శలు

అమరావతి,
ఆంధ్రప్రదేశ్‌లో ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని ప్రభుత్వంపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ ట్విట్టర్ వేదికగా విమర్శలు చేశారు. జగన్ ఏం పోస్టు చేశారంటే”కూటమి ప్రభుత్వం

-మిగతా 3 లో

# విమానంలో పాముల అక్రమ తరలింపు

-స్వాధీనం చేసుకున్న శంషాబాద్ ఎయిర్‌పోర్టు అధికారులు
- ఇద్దరు మహిళల అరెస్టు



**శంషాబాద్**
విదేశాల నుంచి అక్రమంగా పాముల తరలింపు ఘటన శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానా శ్రయంలో సోమవారం కలకలం రేపింది. రోజువారీ చర్యల్లో భాగంగా అధికారులు ప్రయాణికుల లగేజీలు తనిఖీ చేస్తున్న సమయంలో పాములు తీసుకొచ్చిన ఘటన వెలుగు చూసింది. ఎయిర్‌పోర్ట్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. బ్యాంకాక్ నుంచి ఇద్దరు మహిళా ప్రయాణికులు హైదరాబాద్ ఎయిర్‌పోర్టుకు విమానంలో చేరుకున్నారు. వారితో పాటు వారి లగేజీని తనిఖీ చేసిన అధికారులకు ఒక బుట్ట కనిపించింది. అందులో చూడగా రెండు పాములు ఉన్నాయి. ఖంగుతున్న అధికారులు వెంటనే వాటిని స్వాధీనం చేసుకుని, మహిళలను అదుపులోకి తీసుకున్నారు. పాములను ఎందుకు తీసుకొస్తున్నారనే కోణంలో అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కేసీఆర్ పాలనలోనే బీసీలకు న్యాయం

కులగణనకు చట్టబద్ధత ఉందా..? : ఎమ్మెల్సీ కవిత



**హైదరాబాద్,**
కులగణనకు చట్టబద్ధత ఉందోలేదో రాష్ట్ర ప్రభుత్వం చెప్పాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. బీసీ సంఘాలు, యునైటెడ్ ఫులే ఫ్రంట్, తెలంగాణ జాగృతి నాయకులతో కలిసి డెడికేటెడ్ కులగణన కమిషన్‌కు 35 పేజీలతో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో చేపట్టిన సమగ్ర నివేదికను కమిషన్ చైర్మన్ వెంకటేశ్వరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వంలోని గత ప్రభుత్వం బీసీలకు ఎంతో న్యాయం చేసిందన్నారు. కులగణకు బీజేపీ వ్యతిరేకమని విమర్శించారు. కులగణన చేపట్టబోమని బీజేపీ సుప్రీంకోర్టుకు అఫిడవిట్ ఇచ్చిందని గుర్తు చేశారు. బీజేపీ ద్వంద వైఖరిని బీసీలు ఖండించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో ఎన్నో హామీలు ఇచ్చింది. ఇచ్చిన మాట ప్రకారం హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# రేపటికి వాయిదా పడ్డ శీతాకాల సమావేశాలు



**న్యూఢిల్లీ,**
పార్లమెంట్ శీతాకాల సమావేశాలు బుధవారానికి వాయిదా పడ్డాయి. సోమవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమైన ఉభయ సభలు.. తొలుత ఇటీవలేకాలంలో మృతి చెందిన సభ్యులకు సంతాపం తెలిపాయి. ఆ తర్వాత లోక్‌సభ మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా పడింది. సభ తిరిగి ప్రారంభమైన తర్వాత అదానీ అంశంపై చర్చించాలని విపక్షాలు పట్టుబడ్డాయి. దీంతో సభలో గందరగోళం నెలకొనడంతో స్పీకర్ ఓంబిర్లా సభను బుధవారానికి వాయిదా వేశారు. అటు రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి తలెత్తింది. దీంతో ఎగువ సభను చైర్మన్ ధన్‌కర్ బుధవారానికి వాయిదా వేశారు. ఉభయ సభలు బుధవారం ఉదయం 11 గంటలకు తిరిగి ప్రారంభం కానున్నాయి. డిసెంబర్ 20 వరకు జరిగే ఈ సమావేశాల్లో వక్ఫ్ (సవరణ) సహా 16 బిల్లులను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్నది. మణిపూర్ హింస, గౌతమ్ అదానీ అవినీతి చర్యలపై యూఎస్ అరెస్ట్ వారెంట్, ఢిల్లీలో వాయు కాలుష్యం తదితర అంశాలపై ఈ సమావేశాల్లో మోదీ సర్కారును నిలదీసేందుకు విపక్షాలు సిద్ధమయ్యాయి

# రోజుకు 140 మంది మహిళల హత్య

– ఇల్లే వారికి ప్రాణాంతక ప్రదేశం : ఐక్యరాజ్య సమితి నివేదిక వెల్లడి



**న్యూయార్క్**
ఈ భూగోళం మీద మహిళలకు. బాలికలకు అత్యంత ప్రాణాంత కమైన ప్రదేశం ఏదైనా వుందా అంటే అది వారి ఇల్లే అవుతోంది. గతేడాది సగటున రోజుకు 140మంది మహిళలు, బాలికలు వారి భాగస్వాముల లేదా బంధువుల చేతుల్లో మరణించారని ఐక్యరాజ్య సమితికి చెందిన రెండు సంస్థలు సోమవారం పేర్కొన్నాయి. 2023లో దాదాపుగా 51300మంది మహిళల మృతికి వారి భాగస్వాములు లేదా కుటుంబ సభ్యులు కారణమని యుఎన్ వుమెన్, యుఎన్ ఆఫీస్ ఆఫ్ డ్రగ్స్ అండ్ క్రైమ్ తమ నివేదికలో తెలిపాయి. 2022లో ఈ సంఖ్య 48,800 గా వుంది. వాస్తవానికి హత్యల సంఖ్య పెరగడం వల్ల ఈ పెంపు నమోదు కాలేదు. దేశాల నుండి మరింతగా డేటా అందుబాటులోకి రావడం వల్ల పెరిగిందని నివేదిక పేర్కొంది. అంతర్జాతీయంగా మహిళలపై హింస నిర్మూలనా దినోత్సవమైన సోమవారం ఈ నివేదిక వెలువడింది.

అయితే ప్రపంచవ్యాప్తంగా మహిళలు ప్రతి చోటా ఏదో ఒక రూపంలో లైంగిక హింసకు గురవుతూ వున్నారని ఆ రెండు సంస్థలు నొక్కి చెప్పాయి. దీనికి ఏ ప్రాంతమూ మినహాయింపు కాదని పేర్కొన్నాయి. పైపెచ్చు మహిళలకు వారు నివసించే ఇల్లే అత్యంత ప్రమాదకరమైన స్థలంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ హత్యలు అధికంగా ఆఫ్రికాలో చోటు చేసుకున్నాయి. గతేడాది అమెరికాలో కూడా ఈ రేటు ఎక్కువగానే వుంది. ఆసియా దేశాల్లోనే ఈ సంఖ్య గణనీయంగా తక్కువగా వుంది. ప్రతి లక్షమందిలో 0. 8మంది బాధితులు నమోదయ్యారు. యూరప్‌లో ఈ సంఖ్య 0. 6గా వుంది. ఇందుకు పూర్తి విరుద్ధంగా ఇళ్లకు వెలుపల, కుటుంబాలకు బయటనే పురుషుల హత్యలు చోటు చేసుకుంటున్నాయని నివేదిక పేర్కొంది. 2023లో జరిగిన హత్యల్లో 80శాతం మంది పురుషులు కాగా 20శాతం మంది మహిళలు. అయితే కుటుంబాల పరిధిలో ప్రాణాంతకమైన హింస ప్రధానంగా మహిళలపైనే జరుగుతోంది. ఈ హత్యలను నివారించేందుకు ప్రభుత్వాలు ఎంతగానో కృషి చేస్తున్నప్పటికీ హత్యలు ఇంకా ఆందోళనకర స్థాయిలోనే కొనసాగుతున్నాయని నివేదిక పేర్కొంది.

# అర్ధరాత్రి శ్మశానంలో కోడిని బలిచ్చిన అఘోరీ

-కేసు నమోదు చేసిన వరంగల్ పోలీసులు



**వరంగల్,**
నాగసాధు అఘోరీ .. ఈ పేరు ఇటీవల తెలుగు రాష్ట్రాల్లో మార్మోగుతోంది. తన వికృత చేష్టలతో అటు మీడియా, ఇటు సామాజిక మాధ్యమాల్లో హల్చల్ చేసింది. తాజాగా, అఘోరీ ఊహించని వివాదంలో చిక్కుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోడిని చంపినందుకు గానూ ఆమెపై కేసు నమోదైంది. ఈ నెల 19వ తేదీన వరంగల్ నగర శివారులోని బెస్తంచెరువు శ్మశాన వాటికలో పూజలు చేసిన అఘోరి వికృత చేష్టలకు పాల్పడింది. రెండు రోజులు శ్మశానంలో విడిది చేసి అక్కడ విచిత్ర పూజలు చేసి బహిరంగంగానే కోడిని బలిచ్చింది. ఇది చూసిన స్థానికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో తాజాగా వైరల్ అయ్యింది. శ్మశానంలో కోడిని బలివ్వడంపై కరీంనగర్ జిల్లాకు చెందిన జంతు ప్రేమికులు, లా విద్యార్థులు కసిరెడ్డి రోహన్ రెడ్డి, సౌమిత్ పటేల్‌లు వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లోని మామునూరు పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి వీడియోలను పోలీసులకు సమర్పించారు. బహిరంగంగా కోడిని బలిచ్చి రక్తార్పణ చేయడం నేరమని.. కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో అఘోరీపై సెక్షన్ 325 కింద కేసు నమోదు చేశారు. కాగా, పోలీసులు అఘోరికి ఎఫ్ఐఆర్ అందజేయడంతో పాటు స్టేషన్ బెయిల్ మంజూరు చేయరని పిటిషనర్ రోహన్ రెడ్డి తెలిపారు. రెండు నెలల్లోపు ఛార్జ్ షీట్ నమోదు చేస్తారని చెప్పారు. కేసు నిరూపణ అయితే ఒక్క రోజు నుంచి 5 ఏళ్ల వరకూ జైలు శిక్ష పడే ఛాన్స్ ఉంటుందని అన్నారు. ఏ మతం వారైనా దేవుళ్ల పేరుతో జంతుబలి ఇవ్వడం నేరమని పేర్కొన్నారు. ప్రస్తుతం అఘోరీ ఎక్కడ ఉందో పోలీసులు గుర్తించలేదు. గత కొద్ది రోజులుగా ఏపీలో ఆలయాల వద్ద నాగసాధు అఘోరీ హల్చల్ చేసింది. కారులో ప్రయాణిస్తూ వివిధ ఆలయాలకు వెళ్లగా.. నగ్నంగా ఉండడంతో దర్శనానికి అనుమతించలేదు. అనంతరం ఆమె దుస్తులు ధరించి ఆలయాలను సందర్శించారు. ఇటీవలే మంగళగిరిలో నడిరోడ్డుపై హల్చల్ చేయగా పోలీసులు అఘోరీని అతి కష్టం మీద నిలువరించారు. మంగళగిరి హైవేపై బైఠాయించగా.. పోలీసులు అడ్డుకునేందుకు యత్నించారు. దీంతో ఆమె వారిపై దాడికి పాల్పడింది. అనంతరం తెలంగాణకు చేరుకుంది. ఈ క్రమంలోనే సంచలన వ్యాఖ్యలు చేసింది. హిందూ ధర్మం రక్షణ కోసం పోరాడుతుంటే.. తనను అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని అఘోరీ మండిపడ్డారు. హిందూ దేవాలయాలు, ఆడపిల్లలపై అఘాయిత్యాలకు నిరసనగా తాను ఆత్మహత్య చేసుకుంటానని అన్నారు. తెలంగాణలో తనను ఆపే మగాడు ఇంకా పుట్టలేదని పేర్కొన్నారు. తెలంగాణలో ఆలయాలు ధ్వంసం అవుతుంటే ప్రభుత్వం ఏం చేస్తుందని మండిపడ్డారు. సనాతన ధర్మాన్ని కాపాడే బాధ్యత మనందరిపై ఉందని తెలిపింది. స్త్రీలపై దాడులను ఆపే శక్తి మన దగ్గర ఉందని చెప్పుకొచ్చింది. గో హత్యలను నివారించేందుకు పోరాడదామని చెప్పుకొచ్చింది.

# అదానీ గ్రూపుతో వాణిజ్య సంబంధాలు లేవు

-తమిళనాడు సీఎం స్టాలిన్



**చెన్నై :** తమినాడు జనరేషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ (టిఎఎన్‌జిఇడిసిఓ)కు అదానీ గ్రూపు కంపెనీలకు మధ్య ఎలాంటి వాణిజ్య సంబంధాలు లేవని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ సోమవారం స్పష్టం చేశారు. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి వి సెంథిల్‌బాలాజీ గతంలో చేసిన ప్రకటనను ముఖ్యమంత్రి సమర్థించారు. సోమవారం విలేకరులు అదానీ గ్రూపు గురించి ప్రస్తావించగా ‘ఈ విషయం గురించి ఆ శాఖ (విద్యుత్) మంత్రి సెంథిల్ బాలాజీ మాట్లాడారు. దయచేసి దాన్ని వక్రీకరించవద్దు’ అని ముఖ్యమంత్రి సమాధానం ఇచ్చారు. టీఏఎన్‌జీఈడీసీకి అదానీ గ్రూపునకు ఎలాంటి వాణిజ్య సంబంధాలు లేవని తెలిపారు. అలాగే తమిళనాడులో గౌతమ్ అదానీ ఎవరి కలిశారో ముఖ్యమంత్రి వివరించాలని పీఎంకే నాయకులు ఎస్ రామదాస్ చేసిన డిమాండ్‌పై స్టాలిన్ స్పందిస్తూ ‘అతనికి (రామ్‌దాస్‌కు) వేరే పని లేదు. ప్రతిరోజూ ఏదో ఒక ప్రకటన జారీ చేస్తూ ఉంటాడు. అలాంటి వారికి సమాధానం చెప్పాల్సిన పనిలేదు’ అని అన్నారు. కావేరీ డెల్టా ప్రాంతంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరికల నేపథ్యంలో అన్ని ముందు జాగ్రత్త తీసుకున్నట్టు చెప్పారు. అక్కడి స్థానిక కలెక్టర్లకు, అధికారులకు తగిన ఆదేశాలు ఇచ్చినట్టు చెప్పారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో లేవనెత్తవల్సిన అంశాల గురించి ఇప్పటికే రాష్ట్ర ఎంపీలతో సమావేశం నిర్వహించామని, ఆయా అంశాలపై పట్టుపట్టాలని సూచించామని చెప్పారు.

# ఢిల్లీకి ఎన్నిమార్లయినా వెళుతూనే ఉంటాం

(మొదటి తరువాయి)

గౌతమి అదానీపై వివాదానికి, తెలంగాణ ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అంబానీ, అదానీ, టాటా ఎవరికైనా తెలంగాణ రాష్ట్రంలో వ్యాపారం చేసుకునే హక్కు ఉందన్నారు. అయితే ఆదానీపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో వందకోట్ల విరాళం తిరస్కరిస్తున్నట్లు ప్రకటించారు. సోమవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. అదానీ ఇచ్చిన రూ.100 కోట్లు.. ముఖ్యమంత్రి, మంత్రులకు ఇచ్చినట్లు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. స్కిల్ యూనివర్సిటీకి అదానీ ప్రకటించిన.. రూ.100 కోట్లు స్వీకరించకూడదని తమ ప్రభుత్వం నిర్ణయించిందని ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. స్కిల్ యూనివర్సిటీకి రూ.100 కోట్లు బదిలీ చేయవద్దని.. అదానీ సంస్థకు తెలంగాణ ప్రభుత్వం తరఫున లేఖ సైతం రాసిందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గత కొన్ని రోజులుగా అదానీ అంశంపై తీవ్ర దుమారం రేగుతోందని సీఎం రేవంత్ గుర్తు చేశారు. అదానీ నుంచి తెలంగాణ ప్రభుత్వం.. నిధులు సేకరించినట్లు ప్రచారం జరుగుతోందన్నారు. అయితే చట్టబద్ధంగా నిర్వహించే టెండర్లలో అందరికీ సమాన అవకాశాలు ఉంటాయని ఆయన చెప్పారు. నిబంధనల మేరకే టెండర్లు పిలిచి ప్రాజెక్టులు ఇస్తున్నామని పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధంగా, చట్టబద్ధంగానే అదానీ నుంచి పెట్టుబడులు స్వీకరించినట్లు సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. అనవసర వివాదాల్లోకి రాష్ట్ర ప్రభుత్వాన్ని లాగ వద్దని ఈ సందర్భంగా ప్రతిపక్షాలకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జైలుకు వెళ్లాలని తహతహలాడుతున్నారన్నారు. జైలుకెళ్తే సీఎం అవ్వొచ్చని కేటీఆర్ భావిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి వ్యంగ్యంగా అన్నారు. కేసీఆర్ కుటుంబం నుంచి ఇప్పటికే కవిత జైలుకు వెళ్లారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. జైలుకెళ్లినవాళ్లు సీఎం అయ్యేదుంటే.. ముందు కల్వకుంట్ల కవిత అవుతుందని సీఎం రేవంత్ రెడ్డి జోస్యం చెప్పారు. కేసీఆర్ కుటుంబంలో సీఎం సీటు కోసం పోటీ ఎక్కువగా ఉందన్నారు. తన తాజా ఢిల్లీ టూర్ పర్యటనపై సైతం సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కుమార్తె వివాహం కోసమే ఈ ఢిల్లీ పర్యటన అని ఆయన స్పష్టం చేశారు. ఈ ఢిల్లీ పర్యటనతో రాజకీయాలకు ఏమాత్రం సంబంధం లేదని ఆయన ప్రకటించారు. పార్లమెంట్ సమావేశాలపై మంగళవారం పార్టీ ఎంపీలతో చర్చిస్తామని ఆయన తెలిపారు. అందుబాటులో ఉన్న మంత్రులను కలిసి.. రాష్ట్ర సమస్యలను వారికి వివరిస్తామని చెప్పారు. అయితే తాను 28 సార్లు ఢిల్లీ వెళ్లానని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీలా పైరవీలు చేయడానికి.. బెయిల్ కోసం తాను ఢిల్లీ వెళ్లడం లేదని బీఆర్ఎస్ అగ్రనేతలను పరోక్షంగా విమర్శించారు. కానీ కేంద్రాన్ని కలిసి మనకు రావాల్సినవి రాబట్టుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. రాష్ట్రాభివృద్ధి కోసం అవసరమైతే ఎన్నిసార్లు అయినా.. ఢిల్లీ వెళ్తామని సీఎం రేవంత్ రెడ్డి కుండబద్దలు కొట్టారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం.. అదానీకి ఎన్నో ప్రాజెక్టులు కట్టబెట్టిందని గుర్తు చేశారు. అదానీ సంస్థపై లంచాల విమర్శల నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డిపై విధంగా స్పందించారు. అదానీ విషయంలో కొన్ని రోజులుగా దేశ వ్యాప్తంగా చర్చలు జరుగుతున్నాయి. అదానీ నుంచి తెలంగాణ ప్రభుత్వం నిధులు స్వీకరించిందని కొందరు విమర్శలు చేస్తున్నారు. రాజ్యాంగ బద్ధంగా, చట్టబద్ధంగానే అదానీ నుంచి పెట్టుబడులు అనుమతిస్తాం. నిబంధనల మేరకే టెండర్లు పిలిచి ప్రాజెక్టులు ఇస్తున్నాం. దేశంలో ఏ సంస్థలకైనా చట్టబద్ధంగా వ్యాపారం చేసుకొనే హక్కు ఉంటుంది.

# 12,400 కోట్ల ఒప్పందాల సంగతేంటి..?

(మొదటి తరువాయి)

దావోస్‌లో మీరు అదానీతో చేసుకున్న 12,400 కోట్ల ఒప్పందాల సంగతేంటని ప్రశ్నించారు. అదానీకి రాష్ట్రంలోని డిస్కంలను అప్పగించి వాటిని ప్రైవేటీకరించేందుకు మీరు చేస్తున్న కుట్రల మాటేమిటి..? అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ అవినీతి పరుడు అన్న వ్యక్తికే గల్లీ కాంగ్రెస్ రెడ్ కార్పెట్ పరిచిందని , ఢిల్లీలో రాహుల్ వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న ఆదానీతో రేవంత్ రెడ్డి దోస్తీ చేసి ఒప్పందాలు చేసుకున్నాడని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఇప్పుడు అదానీతో అవినీతి బయటికిరాగానే మాట మార్చేశారని , తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అదానీతో చేసుకున్న ఒప్పందాలన్నింటినీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి ఇటీవల అదానీ ప్రకటించిన 100 కోట్ల విరాళాన్ని తిరస్కరిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి చేసిన ప్రకటనపై మాజీ మంత్రి హరీశ్‌రావు స్పందించారు. స్కిల్ యూనివర్సిటీకి ఇచ్చిన 100 కోట్లు నిధులు వెనక్కి తీసుకున్నారు సరే.. అదానీ అవినీతిపై రాహుల్ గాంధీ జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాలని నినదిస్తున్న సమయంలో దావోస్‌లో మీరు అదానీతో చేసుకున్న 12,400 కోట్ల ఒప్పందాల సంగతేంటని ప్రశ్నించారు. అదానీకి రాష్ట్రంలోని డిస్కంలను అప్పగించి వాటిని ప్రైవేటీకరించేందుకు మీరు చేస్తున్న కుట్రల మాటేమిటి అని హరీశ్‌రావు ప్రశ్నించారు. 20 వేల మెగావాట్ల థర్మల్ ప్లాంట్ పెడుతామనే ప్రతిపాదనతో వస్తే, మర్యాదపూర్వకంగా కలిసి చాయ్ తాగించి పంపించేశామని హరీశ్‌రావు స్పష్టం చేశారు. కానీ కాంగ్రెస్ ద్వంద్వ ప్రమాణాలు పాటించిందని తెలిపారు. రాహుల్ గాంధీ అవినీతి పరుడు అన్న వ్యక్తికే గల్లీ కాంగ్రెస్ రెడ్ కార్పెట్ పరిచిందని విమర్శించారు. ఢిల్లీలో రాహుల్ వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న ఆదానీతో రేవంత్ రెడ్డి దోస్తీ చేసి ఒప్పందాలు చేసుకున్నాడని హరీశ్‌రావు అన్నారు. ఇప్పుడు అదానీతో అవినీతి బయటికిరాగానే మాట మార్చేశారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అదానీతో చేసుకున్న ఒప్పందాలన్నింటినీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

# మనమంతా కలసికట్టుగా ముందుకు సాగాలి

(మొదటి తరువాయి)

జరగాలని అధికార, విపక్ష సభ్యులను మోదీ కోరారు.ప్రస్తుతం మనం 2024ను పూర్తి చేసుకోబోతున్నాం అని అన్నారు. పార్లమెంట్‌లో ఆరోగ్యకరమైన చర్చలు జరపాలని ఎంపీలందరికీ విజ్ఞప్తి చేశారు. విపక్షాలను టార్గెట్ చేస్తూ.. పార్లమెంట్‌లో చర్చకు అనుమతించడం లేదని ఆరోపించారు. ఇది 2024 సంవత్సరానికి చివరి కాలం' అని ప్రధాని అన్నారు. 2025 కోసం దేశం సిద్ధమవుతోంది. ఈ పార్లమెంట్ సమావేశాలు ఎన్నో అంశాలపరంగా ముఖ్యమైనవి. భారత రాజ్యాంగాన్ని ఆమోదించి ఈ నవంబరు 26 నాటికి 75వ ఏడాదిలోకి అడుగు పెడుతున్నాం. దానికి గుర్తుగా రేపు సంవిధాన్ సదన్‌లో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించుకుందాం అని మోదీ మీడియాతో మాట్లాడారు. ప్రజల చేత తిరస్కరణకు గురైన కొందరు వ్యక్తులు.. కొందరి చేత గూండాయిజం చేయించి, పార్లమెంట్‌ను నియంత్రించేందుకు ప్రయత్నిస్తున్నారు. వారి చర్యలను దేశ ప్రజలంతా చూస్తున్నారు. సమయం వచ్చినప్పుడు వారు చూస్తూ ఊరుకోరు. అయితే ఇక్కడ బాధించే విషయం ఏంటంటే.. పార్టీలతో సంబంధం లేకుండా కొత్తగా పార్లమెంట్‌కు ఎన్నికైన వారు కొత్త ఆలోచనలతో వస్తుంటారు. కొందరి గందరగోళ చర్యల వల్ల కొత్త ఎంపీలకు సభలో మాట్లాడే అవకాశం రావడం లేదు. వారు ప్రజాస్వామ్య స్ఫూర్తిని గౌరవించరు. ప్రజల ఆకాంక్షలను అర్థం చేసుకోరు. వారికి ప్రజలపై ఎలాంటి బాధ్యత ఉండదు. అందుకే వారు ప్రజల అంచనాలను ఎన్నటికీ అందుకోలేరని మోదీ సభా కార్యకలాపాలు సాగనివ్వని వారి తీరును ఆక్షేపించారు. ప్రపంచం ఇప్పుడు మనల్ని ఎంతో ఆశావహ దృక్పథంతో చూస్తోంది. ఆ గౌరవం పెంపొందేలా సభలో మన ప్రవర్తన ఉండాలి. పార్లమెంట్ వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం ఉంది. దానికి అనుగుణంగా మనం నడుచుకోవాలి. వివిధ అంశాలను సరైన రీతిలో సభలో ఎత్తిచూపడం ద్వారా మనం వారి ఆకాంక్షలను నెరవేర్చగలం. దానినుంచి రాబోయే తరాలు ప్రేరణ పొందుతాయి. ఈ సెషన్ ఫలవంతంగా ఉంటుందని ఆశిస్తున్నాను. ఈ సమావేశాలను ఉత్సాహంగా ముందుకుతీసుకెళ్లాలని ఎంపీలందరినీ కోరుతున్నానని మోదీ అన్నారు. దేశం 2025ని పూర్తి ఉత్సాహంతో, ఉత్సాహంతో స్వాగతించేందుకు సిద్ధమవుతోంది. ఈ పార్లమెంటు సమావేశాలు అనేక విధాలుగా ప్రత్యేకమైనవి. ఇప్పుడు అతిపెద్ద విషయం ఏమిటంటే, మన రాజ్యాంగం 75 సంవత్సరాల ప్రయాణం, 75వ సంవత్సరంలోకి ప్రవేశించడం ప్రజాస్వామ్యానికి మంచి అవకాశమని గుర్తు చేశారు. రాజ్యాంగం 75వ వార్షికోత్సవ వేడుకలను ప్రారంభించడానికి రేపు అందరూ రాజ్యాంగ పరిషత్‌లో కలిసి రావాలని ప్రధాని కోరారు. మహారాష్ట్ర, యూపీలో బంపర్ విజయం సాధించిన తర్వాత ప్రధాని మోదీ తొలిసారి పార్లమెంట్ సమావేశాలను ఉద్దేశించి ప్రసంగించారు. శీతాకాల సమావేశాలు కావడంతో వాతావరణం చల్లగా ఉంటుందని ప్రధాని మోదీ అభిప్రాయం వ్యక్తం చేశారు. విపక్షాలపై విరుచుకుపడిన ప్రధాని మోదీ, కొద్దిమంది వ్యక్తులు సభలో గందరగోళం సృష్టిస్తున్నారని ప్రస్తావించారు. ఆ వ్యక్తులు తమ బాధ్యతలను అస్సలు పట్టించుకోవడం లేదన్నారు. తమ రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలు తిరస్కరించిన కొందరు వ్యక్తులు తమ గూండాయిజంతో పార్లమెంట్‌ను అదుపు చేసేందుకు ప్రయత్నించడం దురదృష్టకరమని ప్రధాని మోదీ అన్నారు. వారు పార్లమెంటులో చర్చకు అనుమతించరు. పార్లమెంటు కార్యకలాపాలను ఆపడమే వారి సొంత లక్ష్యమని ఎద్దేవా చేశారు ప్రధాని మోదీ.

# సీఎం రేవంత్‌రెడ్డికి రోజులు దగ్గరపడ్డాయ్

(మొదటి తరువాయి)

నేను డీజీపీ, ఎస్సీ గారిని అడుగుతున్నా.. రాళ్లతో కొడతామంటే పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కేసులు మా మీద మాత్రమే పెడుతారా? కాంగ్రెస్ ఎమ్మెల్యేల మీద కేసులు ఉండవా? అని నిలదీశారు. మా గిరిజన రైతుల కోసం కదులుతూ మానుకోటలో ధర్నా చేస్తామంటే లగచర్లలో జరిగిన సంఘటనకు మానుకోటలో ధర్నా ఎందుకు అని డీజీపీ ప్రశ్నించారని తెలిపారు. కొడంగల్ రైతుల కోసం ఒక్క మానుకోటలోనే కాదు రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో ఎక్కడెక్కడ దళితులు, బీసీలు, గిరిజనులు ఉన్నారో అక్కడ ధర్నా చేస్తామని స్పష్టం చేశారు. సన్నకారు, బక్క చిక్కిన రైతులతో పెట్టుకున్న ఈ రేవంత్ రెడ్డికి తప్పకుండా బుద్ధి చెప్పే సమయం వస్తుందని కేటీఆర్ స్పష్టం చేశారు. .రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కూకటి వేళ్లతో పెకిలించే దాకా వదిలిపెట్టమని చెప్పారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు రాళ్లతో కొడతామంటే, పెట్రోల్ పోస్తామంటే భయపడమని కేటీఆర్ అన్నారు. మేము కేసీఆర్ తయారు చేసిన దళం.. భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. మానుకోట రాళ్ల మహత్యం ఏందో తెలంగాణను అడ్డుకున్న వాళ్లందరికీ తెలుసని అన్నారు. మానుకోటలో 14 ఏళ్ల క్రితమే నిప్పు పుట్టి ఆ తర్వాత తెలంగాణ వచ్చిందని అన్నారు. ఇవాళ మీరు పర్మిషన్ ఇవ్వకుంటే హైకోర్టుకు వెళ్లి పర్మిషన్ తెచ్చుకున్నామని అన్నారు. ఈ మహా ధర్నాకు వెయ్యి మంది అనుకుంటే 25 వేల మంది వచ్చారని.. అంటే ప్రభుత్వం మీద ఎంత కోపం, వ్యతిరేకత ఉందో ఈ మానుకోట మహాధర్నా చూస్తే అర్థమవుతోందని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో మానుకోట కీలకం ఇదే మానుకోట 14 ఏళ్ల కిందట ఇదే మానుకోట తెలంగాణ ఉద్యమంలో ఓ కీలకమైన మలుపునకు కారణమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మళ్లీ అదే మానుకోట ఇప్పుడు ఎస్సీ, ఎస్టీ, బీసీ భూములు గుంజుకుంటా ఏం చేసుకుంటారో చేసుకోండి అంటున్న కొత్త నియంతకు బుద్ధిచెప్పేందుకు సిద్ధమైందని తెలిపారు. అసలు ముఖ్యమంత్రి నియోజకవర్గం కొడంగల్‌లోని లగచర్లలో ఏం జరిగిందో ప్రజలు తెలుసుకోవాలని అన్నారు. లగచర్లలో ఉండే బీసీ, ఎస్సీ, ఎస్టీ రైతులు ఈ ముఖ్యమంత్రి మీద తిరగబడ్డారని కేటీఆర్ తెలిపారు. వారి భూములను తీసుకుంటామని చెబితే మా ఆడబిడ్డలు 9 నెలల పాటు ధర్నా చేసి నిరసన తెలిపారని అన్నారు. 9 నెలలుగా సొంత నియోజకవర్గంలో ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ఈ ముఖ్యమంత్రికి సమయం లేదని విమర్శించారు. కానీ ఎక్కే విమానం దిగే విమానం అన్నట్లుగా 28 సార్లు ఢిల్లీకి పోయిండు.. కనీసం 28 పైసలు కూడా తేలేదని ఎద్దేవా చేశారు.

## రాజ్యాంగ ప్రవేశికపై సుప్రీం కీలక తీర్పు

(మొదటి తరువాయి)

వెలువరించింది. రాజ్యాంగ పీఠికలో సామ్యవాద, లౌకిక అనే పదాలను జోడిస్తూ 1976లో చేసిన 42వ సవరణను సవాలు చేస్తూ సుప్రీంకోర్టు లో పిటిషన్లు దాఖలయ్యాయి. ఆ పదాలను తొలగించాలని కోరుతూ భాజపా నేత సుబ్రహ్మణ్య స్వామి తదితరులు ఈ పిటిషన్లు వేశారు. ఆ సవరణపై పార్లమెంట్‌లో చర్చే జరగలేదని వారు వాదించారు. ఎమ్జ్గ÷న్సీ (1975-77) సమయంలో చేసిన ఈ సవరణల చట్టబద్ధతను వారు ప్రశ్నించారు. ఈ పిటిషన్లపై పలు వాదనలు విన్న సుప్రీంకోర్టు నవంబర్ 22న తీర్పు రిజర్వ్ చేసి, తాజాగా ఆ పిటిషన్లను కొట్టివేసింది. ఈ పదాలకు వివిధ వివరణలున్నాయని.. వేర్వేరుగా అన్వయించుకుంటున్నారని గత విచారణల్లో సుప్రీం ధర్మాసనం అభిప్రాయపడింది. 'సోషలిజం అంటే.. అందరికీ సమాన అవకాశాలు ఉండాలని. సమానత్వం అనే అంశాన్ని ఇది ప్రతిబింబిస్తుంది. మీరు దీనిని మరో రకంగా చూడకూడదు. అప్పుడు వేరే అర్థం కూడా వస్తుంది. ఇక సెక్యులర్ అనే పదం కూడా అంతే' అని పేర్కొంది.

## ముగిసిన జేఈఈ దరఖాస్తు గడువు

(మొదటి తరువాయి)

28న ప్రారంభమైన దరఖాస్తు ప్రక్రియలో మొదటి రెండు వారాల్లో కేవలం 5.10 లక్షల మందే దరఖాస్తు చేసుకున్నారు. దీంతో ఈసారి దరఖాస్తుల సంఖ్య తగ్గిపోవచ్చని అనుకున్నా, చివరికి అంచనాలను అధిగమిస్తూ 13.8 లక్షల మందికి పైగా దరఖాస్తులు అందాయి. నవంబర్ 22 నాటికి దరఖాస్తు ప్రక్రియ ముగిసింది. కానీ, గత ఏడాది తో పోల్చితే ఈసారి స్వల్పంగా దరఖాస్తులు తగ్గినట్లు తెలుస్తోంది. పూర్తి వివరాలు ఎన్టీఏ ఇంకా వెల్లడించలేదు. అయితే, జేఈఈ జనవరి సెషన్ పరీక్షలు 2025 జనవరి 22 నుంచి 31 వరకు జరగనున్నాయి. రెండవ సెషన్ ఏప్రిల్ 1 నుంచి 8 వరకు ఉంటుంది. అడ్మిట్ కార్డులు 2025 జనవరి 19 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ ఏడాది జేఈఈ పరీక్షలో కొన్ని మార్పులు చేసారు. 2020 కోవిడ్ సమయంలో జేఈఈ సెక్షన్ %దీ%లో ఉన్న ఐచ్ఛిక ప్రశ్నల విధానాన్ని తొలగించి, 10 ప్రశ్నలకు బదులుగా 5 ప్రశ్నలు మాత్రమే ఇవ్వడం ప్రారంభించారు.అలాగే, న్యూమరికల్ వాల్యూ ప్రశ్నలకు నెగెటివ్ మార్కింగ్ విధానం ప్రవేశ పెట్టారు.

## ప్రైవేట్ రంగంలో ప్రాజెక్టులు, రోడ్లు

(మొదటి తరువాయి)

స్థాయిలో రోడ్ల నిర్వహణను అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీకి అప్పగించాలని చంద్రబాబు యోచిస్తున్నారు. వారు టోల్ ఫీజు వసూలు చేసుకుంటారు. ఉభయ గోదావరి జిల్లాల్లోని రోడ్లపైన పైలట్ ప్రాజెక్టుగా టోల్‌గేట్లు ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు అసెంబ్లీలో చెప్పారు. ఈ క్రమంలో చంద్రబాబునాయుడు ఏపీలో అభివృద్ధి పనులకు ఈ మోడల్ అనుసరించాలనుకుంటున్నారు. అంటే రోడ్లను ప్రైవేటు కంపెనీలతో వేయిస్తారు. ప్రజల నుంచి టోల్ వసూలు చేస్తారు. ఇప్పటి వరకూ జాతీయ రహదారుల్లో ఈ విధానం ఉంది. ఇప్పుడు రాష్ట్ర రహదారులకూ తీసుకు వస్తారు. అలాగే గోదావరి నీటిని బనకచర్ల వరకూ తీసుకెళ్లేందుకూ ప్రైవేటు పెట్టుబడులను ఆహ్వానిస్తున్నారు. ఇందుకు రూ. 70వేల కోట్లు ఖర్చవుతాయి. అంటే ఆ డబ్బులూ ప్రజలు కట్టాల్సిందే. మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి, జిల్లా కేంద్రం నుంచి రాష్ట్ర,జాతీయ రహదారులకు వెళ్లే మార్గాల్లో టోల్‌గేట్లు ఏర్పాట్లు చేయాలని భావిస్తున్నట్లు సిఎం తెలిపారు. వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నప్పుడు తానే పిపిపి పద్ధతిలో జాతీయ రహదారుల అభివృద్ధి ప్రతిపాదన చేశానని అప్పట్లో తనను అందరూ వ్యతిరేకించారని, కానీఇప్పుడు దేశ వ్యాప్తంగా నాలుగు, ఆరు, ఎనిమిది, 14 లైన్ల జాతీయ రహదారులు కూడా వచ్చాయన గుర్తు చేసుకున్నారు.

## బీజేపీ బాధ్యత వహించాలి

(మొదటి తరువాయి)

కాదని పేర్కొన్నారు. సంభాల్ ఘర్షణ, మరణాలకు దారి తీసిన వ్యవహారంలో బీజేపీ నేరుగా బాధ్యత వహించాలని వివరించారు. ఈ విషయంలో భారత సర్వోన్నత న్యాయస్థానం వెంటనే జోక్యం చేసుకోవాలని ఆయన కోరారు. ఆదివారం సంభాల్‌లోని మొఘల్ కాలం నాటి షాహీ జామా మసీదులో రెండోసారి సర్వే నిర్వహించటానికి అధికార బృందం రాగా.. అక్కడి స్థానికులు పెద్ద ఎత్తున వ్యతిరేకత తెలపటంతో పోలీసులు వారిపై భాష్పవాయువును, రబ్బరు బుల్లెట్లను ప్రయోగించారు. ఈ ఘటనలో ముగ్గురు ముస్లిం వ్యక్తులు చనిపోగా, పలువురికి గాయాలైన విషయం విదితమే. దీంతో ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారి తీసింది. రాజకీయంగానూ ఈ ఘటన తీవ్ర దుమారాన్ని రేపింది. ఈ ఘటనపై సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా రాహుల్ స్పందించారు. బీజేపీ, యూపీ ప్రభుత్వ తీరును రాహుల్ తప్పుబట్టారు. "యూపీలోని సంభాల్‌లో ఇటీవల చోటు చేసుకున్న వివాదంలో రాష్ట్ర ప్రభుత్వ పక్షపాత, తొందరపాటు వైఖరి చాలా దురదృష్టకరం. హింసలో, కాల్పుల్లో తమ ప్రియమైన వ్యక్తులను కోల్పోయినవారికి నా ప్రగాఢ సానుభూతి" అని ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## విద్యార్థులపై కక్షకట్టిన చంద్రబాబు

(మొదటి తరువాయి)

విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతోంది. మూడు త్రైమాసికాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు చెల్లించకపోవడంతో చదువులు మానుకోవాల్సిన పరిస్థితులు వచ్చాయి. వారిపై చంద్రబాబు కక్షకట్టినట్టు వ్యవహరిస్తున్నారు. ఒంగోలు జిల్లా జె.పంగులూరులో ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక, ఫీజులు కట్టలేక పనులకు వెళ్తున్న విద్యార్థి కథనం ఆవేదన కలిగించింది." అని దానికి సంబంధించిన పేపర్ క్లిప్పింగ్ కూడా పోస్టు చేశారు. చంద్రబాబు రాగానే అన్ని రంగాల్లోనూ తిరోగమనమే కనిపిస్తోందని విమర్శించారు జగన్. ముఖ్యంగా విద్యారంగాన్ని దారుణంగా దెబ్బతీశారన్నారు. అమ్మ ఒడిని, ఇంగ్లీష్ మీడియంను, 3వ తరగతి నుంచి టోఫెల్, 3వ తరగతి నుంచే సబ్జెక్టు టీచర్లు, సీబీఎస్ఈ, సీబీఎస్ఈ నుంచి ఐబీ దాకా ప్రయాణం, 8వ తరగతి పిల్లలకు ట్యాబులు, బైజూస్ కంటెంట్, నాడు-నేడు ఇలా అన్నింటినీ రద్దుచేసిందన్నారు. 1-12వ తరగతి విద్యార్థులను, వారి తల్లులను కూడా దెబ్బతీశారని ధ్వజమెత్తారు. వసతిదీవెన, విద్యాదీవెన నిలిపేసి, డిగ్రీ, ఇంజినీరింగ్, డాక్టర్ చదువుతున్నవారినీ ఇబ్బందిపెడుతున్నారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రతి త్రైమాసికం పూర్తికాగానే తల్లుల ఖాతాలో జమచేసే వాళ్లమని అన్నారు. ఇలా గత విద్యాసంవత్సరం డిసెంబర్ త్రైమాసికం వరకూ రూ. 12,609 కోట్లు ఒక్క విద్యాదీవెనకే ఖర్చు చేశామని తెలిపారు.

## సంపాదకీయం

# రాచనాగుల రహస్యం బయటపడింది

పేరుకు తగినట్టుగానే రాచనాగు చాలా పొడవైన పాము. దీనినే కింగ్ కోబ్రా అంటామను. ఇది మూడు నుంచి నాలుగు అడుగుల పొడవు ఉంటుంది. దీన్ని చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది.సాధారణంగా ఇది మనుషులకు దూరంగా ఉంటుంది. అయినప్పటికీ వాటిపైన సర్వేలు నిర్వహించే సమయంలో, లేదా వాటిని రక్షించే సమయంలో, లేదా కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో రాచనాగులు మనుషులపై దాడి చేసే ప్రమాదం ఉంది. అలాంటి పరిస్థితిలోనే, సరీసృపాల పరిశోధకులు డాక్టర్ గౌరీ శంకర్‌ను 2005లో కోబ్రా కాటు వేసింది. ఏనుగును సైతం చంపగల ఈ విషసర్పం కాటు వేసిన తర్వాత, ఆయన మరణం అంచుల వరకు వెళ్లి వచ్చారు. ఆ తర్వాత కోబ్రాపై ఆయన మరింత నిశితంగా పరిశోధనలు చేయడం ప్రారంభించారు. ఈ పరిశోధనల్లో భాగంగా ఆయన బృందం 180 ఏళ్లకు పైగా వెలుగుచూడని ఓ శాస్త్రీయ రహస్యాన్ని బయటకు తీసింది. ÷ారతదేశంలో పాము కాటుకు, ప్రత్యేకించి కోబ్రా కాటుకు ఎలాంటి మందూ లేదు. థాయ్‌లాండ్ నుంచి ఔషధాలు దిగుమతి చేసుకుంటాం. డాక్టర్ గౌరీ శంకర్‌ను పాము కరిచినప్పుడు థాయ్‌లాండ్ నుంచి తెచ్చిన ఔషధం ఆయన శరీరానికి సరిపడలేదు. అలాగే భారత్‌లో అందుబాటులో ఉన్న కంబైన్డ్ ఎ÷-లాసెంటల్ ఔషధం కూడా అలర్జీలకు కారణమవుతోంది.అదృష్టవశాత్తూ ఆ పాము ఆయన్ని పూర్తిస్థాయిలో కాటేయలేదు. కోబ్రా విషం వల్ల కలిగే నాడీ సంబంధిత సమస్యలకు యాంటీ ఎమెటిక్ డ్రగ్స్ సరిగ్గా పనిచేయకపోతే పాము కాటు తర్వాత కనిపించే లక్షణాలను బట్టి చికిత్స అందించాల్సి ఉంటుంది. కరోనా మహమ్మారి విజృంభించిన తొలినాళ్లలో సరైన మందులు లేకపోవడంతో పాము కాటు తర్వాత అతనిలో కనిపించిన లక్షణాల ఆధారంగా చికిత్స అందించారు.చాలా అడ్డంకులను దాటుకుని చివరకు గౌరీ శంకర్ కోలుకున్నారు. తర రకాల పాములపై చేసినన్ని అధ్యయనాలు కింగ్ కోబ్రాపై జరగలేదు. గత 15 ఏళ్లుగా మాత్రమే ఇలాంటి అధ్యయనాలు మొదలయ్యాయి. ఇన్నేళ్లుగా నిర్వహించిన అధ్యయనాలన్నీ.. బంధించి ఉన్న కోబ్రాలపై మాత్రమే జరిగాయి. కోబ్రాల సహజ ఆవాసాలలో లోతైన అధ్యయనాలు జరగలేదు. అందుకే వాటి గురించిన శాస్త్రీయ నిజాలు అనేక ఏళ్లుగా బయటకు రాలేదు. ప్రపంచంలో మొత్తం నాలుగు రకాల కోబ్రా జాతులున్నాయి. కోబ్రా జాతులను గుర్తించి, పేర్లు పెట్టేందుకు 1961వరకు ప్రయత్నాలు జరిగినప్పటికీ అవి ఫలించలేదు. డాక్టర్ గౌరీ శంకర్ బఈందం పూర్తి సమాచారంతో ఇప్పుడు అది చేయగలిగారు. క్కో రకం కోబ్రా ఒక్కో తరహా ప్రత్యేక భౌగోళిక పరిస్థితుల్లో నివసిస్తుంది. పశ్చిమ కనుమలలో ఒక్క జాతికి చెందిన రాచనాగు మాత్రమే ఉంది. న్నాళ్లూ భారతదేశంలో ఓఫియోఫేగస్ హన్నా అనే శాస్త్రీయ నామం ఉన్న ఒక రాచనాగు జాతి మాత్రమే నివసిస్తుందని భావించారు. అదే శాస్త్రీయ నామానికి చెందిన రాచనాగ జాతులు ఉత్తర భారతదేశంలో, తూర్పు భారత్‌లో ఉన్నాయని గుర్తించారు. అలాగే తూర్పు పాకిస్తాన్‌లోనూ అవి ఉన్నాయి. ఈ రాచనాగు, పశ్చిమ కనుమలలో నివసించే రాచనాగు రెండు విభిన్నజాతులకు చెందినవి. దశాబ్దంపాటు డాక్టర్ గౌరీ శంకర్, ఆయన బృందం నిర్వహించిన పరిశోధనలో ఇది తేలింది.తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లోని పశ్చిమ కనుమల్లో నివసించే ప్రత్యేక జాతి ప్రపంచంలో మరెక్కడా లేదని ఈ అధ్యయనంలో తేలింది. పరిశోధకులు ఈ ప్రత్యేకమైన కింగ్ స్నేక్‌కు ఓఫియోఫాగస్ కళింగ అని పేరు కూడా పెట్టారు. ÷ాచనాగు అని పిలుస్తున్నప్పటికీ, ఇవి శాస్త్రీయంగా కోబ్రా కుటుంబానికి చెందినవే, కానీ వీటి లక్షణాలు వేరుగా ఉంటాయి. రెండు రకాల పాముల ఆవాసాలు, జీవనశైలి, ప్రవర్తనలో తేడాలు ఉన్నాయి. కోబ్రాలు నాజా జాతికి చెందినవి. కానీ, రాచనాగులను ఓపియోఫేగస్ జాతి కింద వర్గీకరించారు. శరీర పరిమాణంలో రెండింటికీ చాలా తేడా ఉంది. కోబ్రాలు 6 నుంచి 8 అడుగుల వరకు పెరుగుతాయి. కానీ భారతదేశంలో కనిపించే రాచనాగు గరిష్ఠంగా 14 అడుగుల వరకు పెరుగుతుంది. కోబ్రా శరీరమంతా ఒకే రంగులో ఉంటుంది. కానీ కింగ్ కోబ్రా శరీరంపై లేత రంగులో చారలుంటాయి. నుషులు నివసించే ప్రాంతాలలో డ్రాగన్ ఎక్కువగా కనిపిస్తుంటుంది. అయితే, రాచనాగులు ఎక్కువగా దట్టమైన, ఎత్తైన అడవులలో నివసిస్తాయి. ఇటీవలి కాలంలో అవి జనావాసాల్లో కూడా కనిపిస్తున్నాయి. ఒకే చోట ఒకటి కంటే ఎక్కువ కోబ్రాలు కనిపిస్తే ఆందోళన కలుగుతుంది. అయితే రాచనాగులు మనుషులు నివసించే ప్రాంతాల్లో ఉండగలవు. అంతే కాకుండా అవి తీసుకునే ఆహారంలో, సంతానోత్పత్తి విధానంలో తేడాలున్నాయి. రాచనాగులకు గూడు కట్టుకుని, అందులో గుడ్లు పెట్టే అలవాటు ఉంది. గుడ్లు పొదిగి పిల్లలయ్యేదాకా ఆ పాములు వాటిని జాగ్రత్తగా సంరక్షిస్తాయి. కోబ్రాలకు కూడా గుడ్లను సంరక్షించే అలవాటు ఉన్నప్పటికీ... వాటికి గూడు కట్టుకునే అలవాటు లేదు. వీటితో పాటు ఈ రెండింటి మధ్య ఇంకో ముఖ్యమైన తేడా ఉంది. చి÷-టటెలుకలు, పక్షులు, కప్పలు వంటివాటిని కోబ్రాలు తింటాయి. కానీ కింగ్ కోబ్రా తినే ఆహారంలో ఇతర పాములు మొదటి ప్రాధాన్యంగా ఉంటాయి. పచ్చపాములను, ఇతర చిన్న పాములను ఇవి తింటాయి. కింగ్ కోబ్రా కాటు వల్ల మరణించే వారి సంఖ్య చాలా తక్కువగా ఉంది. భారత్‌లో యాంటీ ఎమెటిక్స్ అభివృద్ధి చేయడంపై దృష్టి పెట్టకపోడానికి ఇది ఓ కారణం. భారత దేశంలో కోబ్రా కాటువేయడం చాలా తక్కువగా జరుగుతున్నప్పటికీ, గ్రామీణ ప్రాంతాల్లో ఇటీవల కొంచెం ఇవి పెరిగాయి. దీని కాటుకు పూర్తి స్థాయిలో మందు లేదు. వీటి మందుతయారీపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది.

# వ్యవసాయంపై రైతులకు తగ్గుతున్న ఆసక్తి..

నిత్యావసర ధరలు, వైద్య ఖర్చులపై కేంద్రం తాజాగా నివేదిక వెల్లడించింది. ధరల జాతీయ సగటు దాదాపు వంద శాతం నుంచి 200 శాతం వరకు పెరిగినట్లు 'వినియోగదారుల ధరల సూచిక (కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్-సీపీఐ)', వినియోగదారుల ఆహార ధరల సూచిక (కన్స్యూమర్ ఫుడ్ ప్రైస్ ఇండెక్స్-సీఎఫ్‌పీఐ) 2024 నివేదిక వెల్లడించింది. చాలా రాష్ట్రాలలో సరైన సాగు పద్ధతులు లేకపోవడంతోపాటు పెట్టుబడి కూడా ఎక్కువ కావడంతో ధరల పెరుగుదలపై తీవ్ర ప్రభావం పడుతోంది. గతంలో పల్లె జనాభాలో 70శాతానికిపైగా రైతు కుటుంబాలు ఉండేవి. ఆ కుటుంబా ల్లోనూ దాదాపుగా అందరూ వ్యవసాయంలో భాగస్వాములు అయ్యేవారు. కానీ, ఇప్పుడు పల్లెల్లో రైతులు 50శాతం కూడా లేరు.నిజానికి పల్లెల్లో వ్యవసాయం ఇప్పుడు ప్రధాన వృత్తి కాదు. రియల్ ఎస్టేట్, రిటైల్ షాపులు సహా బట్టల దుకాణాలు, చికెన్ షాపులు ఇలా ఎన్నో ఉప వృత్తుల వైపు రైతు కుటుంబాలు దృష్టి సారిస్తున్నాయి. ఫలితంగా వ్యవసాయం, అంతరపంటలపై ఎవరికీ పెద్దగా ఆసక్తి ఉండటం లేదు. గతంలో ప్రతి ఇంటికీ కూరగాయల పాదులు, కోళ్లు, మేకలు, గొర్రెలు, ఆవులు, బర్రెల పెంపకం ఉండేది. కానీ, ఇప్పుడు వాటి పెంపకం రైతు కుటుంబాల జీవనశైలికి ఆటంకంగా మారింది. ఏదైనా పెళ్లి పేరంటానికి వేరే ఊరికి వెళ్లాల్సి వస్తే కోళ్లు, మేకలు, గేదెల కోసం ఎవరో ఒకరు తప్పక ఉండాల్సి వస్తుంది. అందుకు చాలామంది సిద్ధంగా లేకపోవడంతో వాటి పెంపకమే తగ్గిపోయింది. పల్లెల్లోకి కూడా ప్యాకెట్ పాలు వస్తుండటంతో ఆవులు, బర్రెలను పెంచాల్సిన అవసరం ఏమున్నది? అనే ప్రశ్నలు వస్తున్నాయి. గతంలో అంతరపంటలు సహా ప్రధాన పంటలకు విత్తనాలు సొంతంగా అభివృద్ధి చేసుకునేవారు. ఇప్పుడు కంపెనీలే విత్తనాలు కొనుగోలు చేయాల్సి వస్తుండటం.. అంతరపంటల విత్తనాలు నాసిరకంగా ఉంటుండటంతో చాలామంది రైతులు శ్రద్ధ చూపడంలేదు. ఫలితంగా గ్రామాల్లో ఆదాయం చాలా తగ్గిపోయింది. ఒకప్పుడు బోడకాకరకాయ పల్లెల్లో పెంటలపై మొలిచేది. వాటిని చాలామంది తినేవారు కూడా కాదు. కానీ, ఇప్పుడు పట్టణాల్లో దాని ధర కిలో 200పైమాటే. పూర్వం రైతులు వరి, పెసర, కంది సజ్జలు, నువ్వులు, ఉలవలు, రాగులు, మినుములు పజ్జొన్నలు, ఎర్ర జొన్నలు, తెల్ల జొన్నలు, మక్కజొన్న, బుడ్డ శనగలు, అలసంద, గోధుమ తదితర పంటలు సాగు చేసేవారు.



ఈ సంప్రదాయ వ్యవసాయం వల్ల పల్లెల్లో గ్రామీణ స్వయం పోషక విధానం ఉండేది. కానీ.. ఇప్పుడు చిరుధాన్యాలు, ఆరుతడి పంటల సాగు తగ్గిపోయింది. దీంతో మనం చిరుధాన్యాలు, పప్పు దినుసులు దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. దాంతో లక్షల టన్నుల వ్యవసాయ ఉత్పత్తులు తగ్గిపోతున్నాయి. ఫలితంగా ధరలు పెరుగుతున్నట్లు సర్వేలు చెబుతుండగా.. సామాన్యుడు బతకలేని పరిస్థితికి వచ్చింది. వ్యవసాయం చేయడం దండుగ అని ఇప్పటికే చాలామంది రైతులు అభిప్రాయపడుతున్నారు. తమ పిల్లలను మాత్రం ఈ రొంపిలోకి దింపొద్దని బలంగా అనుకుంటున్నారు. చాలామందిలో ఈ అభిప్రాయం ఉండటంతో అసలు వచ్చే కొన్నేళ్లలో వ్యవసాయంలోకి కొత్త తరం వస్తుందా? అనే భయాలు నెలకొన్నాయి. గతంలో ప్రతి రైతు తమకు ఉన్న నైపుణ్యాలతో సాగు మెళకువలు పెంచుకుంటూ కొత్త ప్రయోగాలు చేస్తూ దిగుబడి పెంచుకునేవారు. రకరకాల ఉపయోగకరమైన చిరుధాన్యాలు సహా పప్పు దినుసులు సాగు చేసేవారు. కానీ, ఇప్పుడు పల్లెల్లో ప్రధానంగా వరి.. తర్వాత మొక్కజొన్న, పత్తి తప్ప మిగతా పంటలపై దృష్టి పెట్టడంలేదు. వరికి ప్రభుత్వం మద్దతు ధర ప్రకటిస్తుండటంతో పంటకు మినిమం గ్యారంటీ అన్న కోణంలో రైతులు ఆలోచిస్తున్నారు. కానీ, చిరుధాన్యాలు, పప్పుదినుసులు పండిస్తే అంతకుమించి లాభం వస్తుందని రైతులకు తెలిసినా.. ధైర్యం చేయలేకపోతున్నారు. అకాల వర్షాలకు ఇతర పంటలు నష్టపోతే ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వదని.. దిగుబడి అనుకున్నంత రాకపోతే ఎలా అన్న భయాలు వారిని కొత్త పంటల దిశగా ఆలోచించనీయడంలేదు. ప్రభుత్వాలు, ముఖ్యంగా వ్యవసాయ అధికారులు చొరవ తీసుకుని రైతులకు తగిన సలహాలు ఇస్తే పరిస్థితిలో మార్పు వచ్చే అవకాశం ఉంటుంది మరోవైపు, పిల్లల చదవుల కోసం చాలా మంది యువ రైతులు వ్యవసాయాన్ని వదిలేస్తున్నారు. పల్లెల్లోని మౌలిక వసతుల లేమి వల్ల పట్టణాలు నగరాలకు వలసపోతున్నారు. వాచ్‌మన్ ఉద్యోగాలు, లేబర్ పనులు కూడా చేయడానికి వెనుకాడటం లేదు. చాలా రైతు కుటుంబాలు వ్యవసాయం నుంచి తప్పుకుంటుండటంతో రాబోయే రోజుల్లో కార్పొరేట్ కంపెనీలు వ్యవసాయంలోకి అడుగుపెడతాయి. రైతులనుంచి భూమి లీజుకు తీసుకుని వ్యవసాయం చేస్తాయి. పూర్తి యాంత్రీకరణతో ఆహార ఉత్పత్తులపై పూర్తి ఆజమాయిషీ సాధిస్తాయి. అప్పుడు కిలో రూ. 1000 అయినా ఆశ్చర్యం ఉండదు. పైగా కార్పొరేట్ కంపెనీలు అగ్రదేశాలకు ఎగుమతి చేయడానికే ఎక్కువ ఆసక్తి చూపుతాయి.. కార్పొరేట్ కంపెనీలు వ్యవసాయంపై ఆజమాయిషీ సాధిస్తే దేశంలో ఆహార లభ్యత సహా ఆహారపుటలవాట్లు కూడా వారే నిర్దేశించే పరిస్థితి వస్తుంది. దేశంలో సగటున వ్యక్తి ఆదాయం 12 ఏళ్లలో రెట్టింపైనా.. జీవన ప్రమాణాల్లో మాత్రం ఎలాంటి మార్పు లేదు. సామాన్యుల రోజువారీ జీవనానికి కావాల్సిన నిత్యావసర వస్తువుల నుంచి వైద్యం వరకూ ఖర్చులు అంతే స్థాయిలో పెరిగాయి. 'వినియోగదారుల ధరల సూచిక (కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్-సీపీఐ)', వినియోగదారుల ఆహార ధరల సూచిక (కన్స్యూమర్ ఫుడ్ ప్రైస్ ఇండెక్స్-సీఎఫ్‌పీఐ) 2024 ఆగస్టు నివేదికను ఎన్ఎస్ఎస్ఓ సంస్థకు చెందిన క్షేత్రస్థాయి సిబ్బంది తయారు చేశారు. వీరు దేశవ్యాప్తంగా 1,114 పట్టణాల్లోని మార్కెట్లు, 1,181 గ్రామాల నుంచి సేకరించిన ధరల వివరాలతో సిద్ధం చేశారు. దాని ప్రకారం ఈ ఆగస్టు నివేదికను విడుదల చేశారు. ఇందులో ప్రధానంగా కీలకమైన నిత్యావసర సరుకుల ధరల్లో వ్యత్యాసం, సరుకుల వారీగా, రాష్ట్రాల వారీగా పేర్కొంది. ఇకనైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయంపై దృష్టి సారించి..వ్యవసాయం చేసేలా రైతులను ప్రోత్సహించేందుకు తగిన చర్యలు తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

# మహా పీఠంపై ఎవరు? తెరపైకి కొత్త ముఖాలు !

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారు. 'మహాయుతి' బంపర్ మెజార్టీ సాధించింది. అయితే, ఇప్పుడు వినిపిస్తున్న ప్రధాన ప్రశ్న.. ముఖ్యమంత్రి పదవి ఎవరికి ఇస్తారు? కూటమిలోని బీజేపీ, ఎన్సీపీ, శివసేనల్లో ఏ పార్టీకి ఆ పదవి దక్కుతుంది? ఏ నేత ఆ కుర్చీలో కూర్చుంటారనేది ఆసక్తి కలిగిస్తున్న ప్రశ్న. శివసేన నేత ఏక్‌నాథ్ శిందే ఆ పదవిని వదులుకుని అత్యధికంగా 132 సీట్లు గెలిచిన బీజేపీకి చెందిన మాజీ సీఎం దేవేంద్ర ఫడణవీస్‌కు మద్దతు ఇస్తారా?ఒకవేళ ఎక్కువ సీట్లు గెలిచిన బీజేపీకే సీఎం పదవి ఇస్తే ఫడణవీస్‌కే అవకాశం దొరుకుతుందా? లేదంటే కొత్తవారికి చాన్స్ వస్తుందా? కూటమిలోని మరో పార్టీ నేషనలిస్ట్ కాంగ్రెస్ నేత అజిత్ పవార్ కూడా రేసులోకి వస్తారా? ఈ ప్రశ్నలన్నిటికీ సమాధానం దొరికితే కొత్త సీఎం ఎవరనే ప్రశ్నకు జవాబు చెప్పడం సులభమవుతుంది. హారాష్ట్ర ముఖ్యమంత్రిగా ఏక్‌నాథ్ శిందే ఉన్నప్పటికీ ఎన్నికలకు ముందు కూటమి ఆయన్ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించలేదు. మహా వికాస్ అఘాడి పరిస్థితీ అదే. ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటిస్తే తమ మధ్య గొడవలు రావచ్చని పార్టీల నేతలు ఆందోళన చెంది ఉండవచ్చు. అందుకే ఈ వ్యవహారాన్ని ఎన్నికల తర్వాత తేల్చుకోవాలని భావించి ముందుగా ప్రకటన చేయలేదు. కానీ, ఇప్పుడు నిర్ణయం తీసుకోవాల్సిన సమయం వచ్చేసింది. ఎన్నికలకు ముందు మహా వికాస్ అఘాడిలో ముఖ్యమంత్రి పదవి మీద చాలా గందరగోళం ఉంది. ఉద్ధవ్ ఠాక్రే స్వయంగా ముఖ్యమంత్రి పదవికి ముందుకు రావడానికి ఆసక్తి చూపించారు. అయితే కూటమిలోని మరో రెండు పార్టీలు కాంగ్రెస్, ఎన్సీపీ ఈ ప్రతిపాదనను అంగీకరించలేదు. ఇక 'మహాయుతి'లో ఎన్నికలకు ముందు అలాంటి గందగోళం లేదు. ఈ కూటమి కూడా సీఎం అభ్యర్థిని ముందుగా ప్రకటించనప్పటికీ నేతలెవరూ దానిపై ఆసక్తి కనబరుస్తూ ప్రకటనలేమీ చేయలేదు. అయితే.. ఇప్పుడు ముఖ్యమంత్రి పదవికి అనేక 'ఆప్షన్స్' ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. బీజేపీ అతి పెద్ద పార్టీగా అవతరించింది కాబట్టి ఆ పార్టీ నేత సీఎం కావడానికి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అయితే, త్వరలో ముంబయి



కార్పొరేషన్ సహా, రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనుండడంతో అవన్నీ దృష్టిలో పెట్టుకుని బీజేపీలోనే కొత్త ముఖాలను తీసుకువచ్చే అవకాశం కూడా లేకపోలేదు. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత అదే నేతను సీఎంగా కొనసాగించడం లేదాఎన్నికల ఫలితాల తర్వాత మరొకరికి అవకాశం ఇవ్వడం కూడా జరగొచ్చని అభిప్రాయపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికలు, మరాఠా రిజర్వేషన్లపై కోర్టు నిర్ణయం వెలువడే వరకు ఏక్‌నాథ్ శిందేను ముఖ్యమంత్రిగా కొనసాగించడం మరో ప్రత్యామ్నాయంగా కనిపిస్తోంది. 'మళ్లీ వస్తా' అని ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు ఫడణవీస్‌కు అవకాశం ఇచ్చే అవకాశాలనూ కొట్టిపారేయలేము. బీజేపీ నుంచే కొత్త వ్యక్తిని ముఖ్యమంత్రిని చేసి ఫడణవీస్‌ను కేంద్ర మంత్రివర్గంలోకి తీసుకొనే అవకాశాలూ ఉండొచ్చు. అనేక ఆప్షన్స్ ఉన్నప్పటికీ ఏక్‌నాథ్ శిందే, ఫడణవీస్ ముఖ్యమంత్రి అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. శివసేన, ఎన్సీపీలో సీఎం అభ్యర్థులు ఒక్కొక్కరే ఉన్నారు కానీ బీజేపీలో ఆ సంఖ్య పెద్దదే. ఫడణవీస్ కాకుండా వినిపించే మరో పేరు వినోద్ తావ్డే. హారాష్ట్ర రాజకీయాల నుంచి జాతీయ రాజకీయాల వరకు 'ఎదిగిన' వినోద్ తావ్డే 2014 నుంచి ముఖ్యమంత్రి రేసులో ఉన్నారు. ఆయన ఈసారి ముఖ్యమంత్రి కాగలరా? ఎన్నికలకు కేవలం ఒక రోజు ముందు, గోరేగావ్‌లోని వివంతా హోటల్ దగ్గర తావ్డే డబ్బు పంపిణీ చేస్తున్నారని ఆరోపిస్తూ బహుజన్ వికాస్ అఘాడి కార్యకర్తలు వినోద్ తావ్డేను చుట్టుముట్టారు.ఈ కేసు జనం నోళ్లలో నానింది. ఈ కేసు కారణంగా వినోద్ తావ్డేతో పాటు బీజేపీకి కూడా ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ సంఘటన జరగడానికి కొన్ని రోజుల ముందు, మహాయుతి కూటమి అధికారంలోకి వస్తే పాత ముఖాన్ని తిరిగి తీసుకురావచ్చు లేదా పూర్తిగా కొత్త ముఖాన్ని ఇవ్వవచ్చు అని తావ్డే అన్నారు. ఆయన ప్రకటన తర్వాత పెద్ద ఎత్తున చర్చ జరిగింది. వినోద్ ముఖ్యమంత్రి పదవి కోసం ఆసక్తిగా ఉన్నారని ఊహాగానాలు వచ్చాయి. అయితే, వినోద్ తావ్డే ఇప్పుడు ముఖ్యమంత్రి కాగలరా అనేది కాలమే నిర్ణయించాలి. 2014లో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేవేంద్ర ఫడ్నవీస్‌తో పాటు వినోద్ తావ్డే, ఏక్‌నాథ్ ఖడ్సే, పంకజ ముండే పేర్లు చర్చలో ఉన్నాయి. ఖడ్సే ప్రస్తుతం శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీలో ఉన్నారు. దాంతో ఆయనకు ఇప్పుడు ఎలాంటి అవకాశం లేదు. పంకజ ముండేకు కూడా అవకాశం రావొచ్చని అంటారు కొందరు విశ్లేషకులు. లోక్‌సభ ఎన్నికలలో పంకజ ముండే ఓడిపోయారు. అయినప్పటికీ మహారాష్ట్ర బీజేపీలో ఆమె కీలక మహిళా నేత.ముఖ్యమంత్రి పదవికి మహిళా నేతలను పరిగణనలోకి తీసుకుంటే ఆమె ముందుంటారు. అయితే, మహారాష్ట్రలో బీజేపీ కొత్త ముఖంతో ప్రయోగాలు చేసే అవకాశాలు తక్కువే .

# బీసీ ల పట్ల మీ మోసాలు ఇక సాగవు బీ జె పీ అగ్ర నాయకులారా!





**- పార్లమెంట్ సమావేశాల్లో బీ సీ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదింప చేయాలి!**

ప్రజా స్వేచ్ఛ

బీ సీ కులాల ఉద్యమ పోరాట సంఘం తెలంగాణ రాష్ట్ర మహిళా విభాగం కన్వీనర్ హై కోర్టు న్యాయవాది శ్రీమతి పేరం అలేఖ్య గారు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన 78 ఏళ్లలో 55 సంవత్సరాలు పరిపాలన చేసిన కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు బీ సీ కులాల వారికి రిజర్వేషన్లు కల్పించకుండా అణచివేస్తూ వచ్చినారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ గారు దేశంలోని బీ సీ కులాల వారికి రీజర్వేషన్లు అందాలనీ గత రెండు మూడు సంవత్సరాలుగా బీ సీ ల కుల గణన సర్వే చేయాలని చట్ట సభల్లో బీ సీ ల కు రిజర్వేషన్ లు దక్కాలని రెగ్యులర్ గా ప్రస్తావిస్తూ వస్తున్నారు అలుపెరుగని పోరాటం చేస్తున్నారు. ఓ బీ సీ ప్రధాన మంత్రినని చెప్పుకుంటూ నరేంద్ర మోడీ గారు దేశంలోని ఓ బీ సీ లను రాజకీయంగా, సాంఘికంగా, ఆర్థికంగా ఎదగకుండా రిజర్వేషన్ ఫలాలు అందకుండా గత 17 సంవత్సరాలుగా బిజెపి పార్టీ ప్రధాన మంత్రులు అగ్ర నాయకులు అణచి వేస్తూ వస్తున్నారు. బీ సీ కులాల వారు ఇక ఈ అణచివేతలను భరించే పరిస్థితిలో లేరు. తెలంగాణ రాష్ట్రంలో పూర్తి స్థాయిలో చైతన్యవంతులైనారు.. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా బీ సీ ఉద్యమంలో పాల్గొంటున్నారు. ఈ ఉద్యమం ఇతర రాష్ట్రాలకు కూడా విస్తరించినాది ఇంకా బీ జే పీ అగ్ర నాయకుల మోసాలు సహించే పరిస్థితిలో బహుజనులు లేరు. కాబట్టి నేడు 25 వ తేదీ నుండి జరగబోయే పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో చట్ట సభల్లో బీ సీ కులాల వారికి రిజర్వేషన్లు కల్పించుటకః బీ సీ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదింప చేయాలని అలేఖ్య గారు కోరినారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర కులగనన సర్వే చేపడుతుంటే బీసీ కులాల వారిలో చీలిక తెస్తున్నారంటూ దుష్ప్రచారం చేయటానికి నరేంద్ర మోడీ గారు పూనుకోవడం బీసీల పట్ల తన వ్యతిరేకతను ప్రదర్శిస్తున్నారు. అగ్రకులాల వారిలో ఈడబ్ల్యూఎస్ ఎకనామికల్ సెక్షన్ పేరిట అగ్రకులాల వారు అడగకుండా ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ 10% అమలు చేయడం ఇదే ప్రత్యక్షంగా వేసే కులాల



వారిని అనగా దొరకడంలో ప్రధాన ఉద్దేశం గత సంవత్సరం చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అని అర్థమేగాల మీద పార్లమెంటును సమావేశపరిచి అగ్రకులాల మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లు ఆమోదించడం బిజెపి పార్టీ అగ్రకులాల వారికి చేస్తున్న సేవలు ప్రత్యక్షంగా కనిపిస్తున్నాయి రాహుల్ గాంధీ గారు అంటున్నట్లుగా బిజెపి ప్రభుత్వం అదాని అంబానీలోకే మాత్రమే సేవ చేస్తున్నారని అంటున్నారు కానీ దేశంలోనే మొత్తం అగ్రవర్ణాల వారికి ఈ బిజెపి పార్టీ పట్టుదలతో సేవ చేస్తున్నారు గత ఏడాది 2023లో జరిగిన శాసనసభల ఎన్నికల సందర్భంలో నవంబర్ 30వ తేదీన ఓటింగ్ జరగవలసి ఉండగా అక్టోబర్ 27వ తేదీన బిజెపిని గెలిపిస్తే బీసీని ముఖ్యమంత్రి చేస్తామని ఒక మోసపు ప్రకటన చేసినారు ఆ ప్రకటన అనుసరించి 119 నియోజకవర్గాల్లో ఏ ఒక్క స్థానంలోనూ బీసీల చైతన్యానికి ప్రచార రథం ఏర్పాటు చేయకుండా బీసీ కులాల వారికి సమాచారం అందకుండా కరపత్రాలు లేవు కళాకారులు లేరు వాల్ పోస్టర్లు లేవు డోర్ పోస్టర్లు లేవు ఈ విధంగా ఏ ప్రచార సామాగ్రి ఉపయోగించకుండా ప్రచారం చేయకుండా బీసీ కులాల వారు బిజెపి పార్టీ అభ్యర్థులను గెలిపించలేదు అని ఒక మోసపు దుష్ప్రచారాన్ని కొంతమంది నాయకులు వాదిస్తున్నారు ఈ మోసాన్ని ఆ బిజెపి చోటామోటా నాయకులు గ్రహించకున్నారు అప్పటికైనా 2018 ఎన్నికలలో కేవలం ఒకే ఒక బీజేపీ పార్టీ ఎమ్మెల్యేగా రాజాసింగ్ గారు గెలవగా మొన్నటి ఎన్నికలలో బీసీ ఉద్యమ ప్రభావం గల ఆదిలాబాద్ పూర్వ జిల్లా నుండి నలుగురు బిజెపి అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా గెలిచినారు అది ఆ దుష్ప్రచారాన్ని నమ్మి బీసీ ఉద్యమం పటిష్టంగా గల అదిలాబాద్ జిల్లాలో నలుగురు ఎమ్మెల్యేలు గెలుపు సాధ్యమైంది తదుపరి జరిగిన పార్లమెంటు ఎన్నికలలో ఈ బీజేపీ మోసపు ప్రచారాన్ని కొంతవరకు నమ్మి ఎనిమిది మంది పార్లమెంటు సభ్యులు గెలవడానికి బిజెపి చేసిన బీసీ ముఖ్యమంత్రి ప్రకటన ఉపయోగపడ్డాది ఇప్పుడు నరేంద్ర మోడీ గారు బేషరతుగా అగ్రకులాల వారికి అన్ని విధాల సౌకర్యాలు కల్పించుటకు పగడ్బందీగా మోసపు ప్రచారం చేస్తూ రిజర్వేషన్ను ఎగరకులాల మహిళలకు 33% రిజర్వేషన్ను అమలు చేయపూనుకున్నారు మీరు బిజెపి పార్టీ తరపున ఇలాగే ప్రవర్తిస్తే 2028 లో జరిగే శాసనసభ ఎన్నికలలో మీ పార్టీ తరపున నాయకులు గాని కార్యకర్తలు గాని జెండా పట్టుకుని తిరగడానికి కూడా బేసి కులాల జనం సహించే పరిస్థితి ఉండదని హెచ్చరిస్తున్నాము.

బిసి కులాల సమాజ చరిత్రలో నరేంద్ర మోడీ గారు చారిత్రకమైన నిర్ణయం తీసుకొని చట్టసభల్లో బీసీలకు 50 రిజర్వేషన్లు మరియు 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లులో సబ్ కోటాగా 33 లో ఏబై శాతం రిజర్వేషన్లు కల్పించటకు ప్రయత్నించాలని తెలంగాణ రాష్ట్రంలోని అన్ని బిసి కులాల సంఘాల నుండి మేమందరము కోరుతున్నాము. బిజెపి పార్టీ అగ్ర నాయకులకు ఈ అవకాశం చివరిగా ఇస్తున్నామని ఇకముందు ఏ ఎన్నికలు వచ్చినా మీ పార్టీకి గడ్డు పరిస్థితి ఉంటుందని హెచ్చరిస్తున్నాము. అని అలేఖ్య గారు అన్నారు ఈకార్యక్రమంలో బీ సీ కే యూ పీ ఎస్ మహిళా విభాగం రాష్ట్ర కో కన్వీనర్ తోటపల్లి బాలామణి గారు కుమ్మరి కోడూరి లీలావతి ప్రజాపతి గారు తరిగొప్పుల లక్ష్మి మహేందర్ గారు తదితరులు పాల్గొన్నారు

# రేవంత్ మంత్రివర్గంలోకి ఆ నలుగురు - ఢిల్లీ ఖరారు, శాఖల మార్పు..!!

**-తెలంగాణ మంత్రివర్గ విస్తరణకు రంగం సిద్దం అవుతోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతోంది. దీంతో, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు.**

ప్రజా స్వేచ్ఛ

ఈ నెల 9న సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ జరగనుంది. అదే రోజు నుంచి అసెంబ్లీ సమావే శాల నిర్వహణకు నిర్ణయించారు. కొత్త నిర్ణయాల ప్రకటనకు సిద్దం అవుతున్నారు. దీంతో, ఏడాది పాలన పూర్తికి ముందే మంత్రివర్గ విస్తరణ కు ఏఐసీసీ ఆమోదం తెలిపింది. ఈ రోజు ఢిల్లీ వెళ్తున్న సీఎం రేవంత్ పార్టీ ముఖ్యులతో సమావేశం కానున్నారు.

**ఢిల్లీ పర్యటనలో** తెలంగాణ మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఫిక్స్ అయింది. చాలా రోజులుగా ముఖ్యమంత్రి రేవంత్ తన కేబినెట్ లో ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పుడు ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తవుతున్న వేళ ఇక విస్తరణ పూర్తి చేసేందుకు పార్టీ నాయకత్వం అనుమతి ఇచ్చింది. ఈ రోజు ముఖ్యమంత్రి రేవంత్ ఢిల్లీ వెళు_న్నారు. ప్రజాపాలన విజయోత్స వాల గురించి



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

వివరించి.. పార్టీ ముఖ్య నేతలను ఈ ఉత్సవాలకు ఆహ్వానించనున్నారు.

**రాహుల్ తో భేటీ** రాహుల్ గాంధీతో రేవంత్ ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. మహారాష్ట్ర ఎన్నికల ఫలితాల తరువాత విస్తరణ చేపట్టాలని గతంలోనే రేవంత్ కు ఢిల్లీ నేతలు సూచించారు. దీంతో, ఈ నెల 29న మంత్రివర్గ విస్తరణ ఉంటుందని సమాచారం. కీలకమైన హెూం శాఖను సీతక్క ను ఇవ్వనున్నారు. అదే విధంగా విద్యా శాఖ మంత్రివర్గంలోకి కొత్తగా వచ్చే వారిలో ఒకరికి కేటాయిస్తారని తెలుస్తోంది. ఇక.. రాష్ట్రంలో పెండింగ్ హామీల అమలు పైన ఇప్పటికే ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఆర్దిక పరిస్థితిని పరిగణలోకి తీసుకొని హామీల అమలు దిశగా అడుగులు వేస్తోంది. పెన్షన్ పెంపు పైన ప్రకటన చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.

**కూర్పు - మార్పు** లోక్‌సభ ఎన్నికల ప్రచారం సందర్భంగా ముదిరాజ్‌లకు ప్రాతినిధ్యం కల్పించేందుకు మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని మంత్రిగా చేస్తానని ముఖ్యమంత్రి రేవంత్ ప్రకటించారు. మంత్రివర్గ విస్తరణలో శ్రీహరి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, గడ్డం వివేక్‌ల పేర్ ఖరారైనట్లు తెలుస్తోంది. అదే విధంగా.. నిజామాబాద్ నుంచి సీనియర్ నాయకుడు, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి పేరు సైతం బాగా వినిపిస్తోంది. ప్రస్తుత మంత్రివర్గంలో మైనార్టీల నుంచి ఎవరూ లేరు. దాంతో ఆ వర్గం నుంచి ఒకరికి అవకాశం ఉండొచ్చు. ప్రస్తుతం మంత్రివర్గంలోకి నలుగురిని చేర్చుకొని...స్థానిక సంస్థ ల ఎన్నికల తరువాత మంత్రివర్గ ప్రక్షాళన ఉంటుందని సమాచారం.

## పెద్ద చింతరేవుల ఆలయంలో టెంకాయల వేలం పాట వాయిదా



గద్వాల జిల్లా బ్యూరో, నవంబర్ 25 ప్రజా స్వేచ్ఛ

ధరూర్ మండలంలోని పెద్దచింతరేవులలో వెలసిన శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలో సోమవారం ఎండోమెంటు ఇన్స్పెక్టర్ వెంకటేశ్వరమ్మ ఆధ్వర్యంలో 2025 సంవత్సరానికి గాను టెంకాయలు, కిరాణం విక్రయాలకు టూరిజం భవన అతిథి గృహ నిర్వాహణ, కొబ్బరి చిప్పల సేకరణకు వేలం పాట నిర్వహించారు. టెంకాయలు మరియు కిరాణం వస్తువుల విక్రయాలకు, టూరిజం భవన అతిథి గృహ నిర్వాహణ కొసం డిపాజిట్ దారులు ఎవరు ముందుకు రాకపోవడంతో ఈ వేలంను వాయిదా వేసినట్లు ఎండోమెంటు ఇన్స్పెక్టర్ వెంకటేశ్వరమ్మ తెలిపారు. కొబ్బరి చిప్పల సేకరణకు నిర్వహించిన వేలంలో ముగ్గురు పాల్గొన్నారు. రూ.1.20 లక్షలకు జమ్మిచెట్టుకు చెందిన ఎం.గోపాల్ అనే వ్యక్తి దీన్ని దక్కించుకున్నారు. గత ఏడాది కంటే రూ.9 వేలు మాత్రమే అధికంగా వచ్చిందని అధికారులు తెలిపారు. తదుపరి వేలం పాట ఎప్పుడు నిర్వహిస్తారో త్వరలో వెల్లడిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గిరిరావు, ప్రధాన అర్చకులు కిష్టాచార్యులు సిబ్బంది పాల్గొన్నారు.

## షాద్ నగర్ వ్యవసాయ మార్కెట్ మండల వ్యవసాయ అధికారి నిశాంత్ కుమార్



రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 25 ప్రజా స్వేచ్ఛ

ఫరూఖ్ నగర్ మండలంలోని ఏలికట్ట గ్రామంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని రైతుల కోరిక మేరకు షాద్ నగర్ మార్కెట్ యార్డుకు తరలించడం జరిగిందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి నిశాంత్ కుమార్, ప్యాక్స్ సీఈఓ రఘునందన్ కొరారు. సోమవారం వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహిస్తున్న ప్రభుత్వ వరి కొనుగోలు కేంద్రాన్ని ఫరూఖ్ నగర్ మండల వ్యవసాయ అధికారి నిశాంత్ కుమార్, పాక్స్ సీఈఓ రఘునందన్ రైతులు తెచ్చిన ధాన్యాన్ని పరిశీలించి తేమ శాతం 17 కంటే ఎక్కువ ఉండటం వలన ధాన్యాన్ని ఆరబెట్టుకొని తీసుకురావాలని రైతులకు సూచించారు. ప్రభుత్వ వరి కొనుగోలు కేంద్రాన్ని ఉపయోగించుకొని సన్న వడ్లకు క్వింటాలుకు ప్రభుత్వం ఇచ్చే రూ.500 బోనస్ ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ తేజ్ కుమార్, ప్యాక్స్ ఇంచార్జి అన్వర్ పాల్గొన్నారు.

## ప్రజావాణికి 45 ఫిర్యాదులు




గద్వాల జిల్లా బ్యూరో, నవంబర్ 25 ప్రజా స్వేచ్ఛ

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బియం.సంతోష్ అధికారులకు సూచించారు. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 45 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసరావులకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# కల్వకుర్తి సోషల్ వెల్ఫేర్ హాస్టల్లో ఆర్డీవో శ్రీను నాయక్ ఆకస్మిక తనిఖీలు






**కల్వకుర్తి, నవంబర్ 25 ప్రజా స్వేచ్ఛ**
కల్వకుర్తి పట్టణ పరిధిలో ఉన్న సోషల్ వెల్ఫేర్ హాస్టల్లో ఆర్డీవో శీను నాయక్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఎస్ సి బి హాస్టల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నారా లేదా అనే విషయాలు ఆరా తీశారు. హాస్టల్ వార్డెన్ దీపను అడిగి, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలంటూ ఆదేశించారు. కూరగాయలు, పప్పు మొదలైనవి కూడా పరిశీలించారు. ప్రభుత్వం ఇచ్చిన మెనూ ప్రకారమే అన్నం, కూరగాయలు, పప్పు అందించాలని స్పష్టం చేశారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా, ఆర్డీవో శీను నాయక్ మాట్లాడుతూ, "ప్రభుత్వం విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తుంటే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదు. పిల్లల దృష్టిలో ఉంచుకొని నాణ్యమైన భోజనము, కూరగాయలు అందించాలి. ప్రతి విషయంలో నాణ్యత పాటించాలని" అన్నారు.

# వాటర్ ప్లాంట్ మరియు కళావేదిక ప్రారంభించిన జూపల్లి భాస్కరరావు






**చారగొండ, నవంబర్ 25 ప్రజా స్వేచ్ఛ**
చారగొండ మండల పరిధిలోని జూపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నూతన వాటర్ ప్లాంట్ మరియు కీర్తిశేషులు ఉడుతల జగ్గారావు జ్ఞాపకార్థంగా కళావేదికను నిర్మించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వెల్దండ సింగల్ విండో చైర్మన్ జూపల్లి భాస్కరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జూపల్లి భాస్కరరావును ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ, "తన తండ్రి ఆశేషాలను పాటిస్తూ, పేద విద్యార్థుల కోసం తన సొంత నిధులతో ఈ వాటర్ ప్లాంట్ మరియు కళావేదికను నిర్మించడం జరిగినది. నేను ఇదే స్కూల్లో చదువుకున్నాను కాబట్టి పేద విద్యార్థుల కోసం ఎల్లప్పుడూ సహాయం అందిస్తాను" అని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాగే సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు చేరాలంటే ఈ స్కూల్ కార్పొరేట్ స్థాయి స్కూల్‌కు దీటుగా అభివృద్ధి చేస్తానని, ఇది సాధ్యం అవుతుందని నమ్మకంగా చెప్పారు. విద్యార్థులు తల్లిదండ్రులు మరియు గురువుల మాటలు పాటిస్తూ, క్రమశిక్షణతో మెలగాలని, తద్వారా ప్రయోజకులవుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు సత్యహరిచంద్ర ఫౌండేషన్ రాములు యాదవ్, ప్రశాంత్, మహేష్, భగవాన్, కమలాకర్ రావు, సిరాజ్, కొండల్, సలీం, గోరింట్ల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మీకాంతమ్మకు నివాళులర్పించిన జర్నలిస్టులు



**నర్సంపేట ఆర్సి నవంబర్ 25 ప్రజా స్వేచ్ఛ**
నర్సంపేట వర్కింగ్ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మేదరబోయిన శ్రీనివాస్ తల్లి మేదరబోయిన లక్ష్మీకాంత గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం రోజున సాయంత్రం స్వర్గస్తులయ్యారు. విషయం తెలిసిన తోటి జర్నలిస్టులు లక్ష్మీకాంత మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించి తమ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగడ సానుభూతి తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట వర్కింగ్ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి ఆకారపు మోహన్, కోశాధికారి జెల్ల నరేష్, కమిటీ సభ్యులు నరేష్, సుమంత్, నాగరాజు, శ్రీకాంత్, ఏకాంబరం తదితరులు నివాళులర్పించారు.

# నేటి నుంచి పార్లమెంట్ సమావేశాలు.తెరపైకి ఈ బిల్లులు..!!

**ప్రజా స్వేచ్ఛ**
పార్లమెంట్ శీతాకాల సమావేశాలకు ముహూర్తం ఫిక్స్ అయింది. ఈ రోజు నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. వచ్చే నెల 20వ తేదీ వరకు ఈ సమావేశాలు జరుగుతాయి. ఈ సెషన్ లో జమిలి ఎన్నికల బిల్లు ప్రవేశపెట్టే అవకాశం ఉండగా, వక్ఫ్ సహా 16 బిల్లులపై చర్చించనున్నారు. సభలో చర్చించేటువంటి అంశాలను లోక్ సభ స్పీకర్, రాజ్యసభ చైర్మన్ ముందుగానే పరిశీలిస్తారని తెలియజేశారు. వారు అనుమతించిన వాటి పైననే పార్లమెంటులో చర్చలు జరుగుతాయని కేంద్రమంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు.

పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో కేంద్రం ప్రవేశపెట్టనున్న బిల్లులు.. 1. భారతీయ వాయుయన్ విధేయక్ బిల్లు, 2024

2. విపత్తు నిర్వహణ (సవరణ) బిల్లు, 2024
3. గోవా అసెంబ్లీ నియోజకవర్గాలలో షెడ్యూల్డ్ తెగల ప్రాతినిధ్య పునర్నిర్మాణ బిల్లు, 2024
4. ది బిల్స్ ఆఫ్ లాడింగ్ బిల్లు, 2024



5. ది క్యారేజ్ ఆఫ్ గూడ్స్ బై సీ బిల్లు, 2024
6. రైల్వేస్ (సవరణ) బిల్లు, 2024
7. బ్యాంకింగ్ చట్టాల (సవరణ) బిల్లు, 2024
8. ముసల్మాన్ వక్ఫ్ (రద్దు) బిల్లు, 2024
9. వక్ఫ్ (సవరణ) బిల్లు, 2024
10. చమురు క్షేత్రాల (నియంత్రణ మరియు అభివృద్ధి) సవరణ బిల్లు, 2024
11. బాయిలర్స్ బిల్లు, 2024
12. రాష్ట్రీయ సహకారి విశ్వవిద్యాలయ బిల్లు, 2024
13. పంజాబ్ కోర్టుల (సవరణ) బిల్లు, 2024
14. మర్చంట్ షిప్పింగ్ బిల్లు, 2024
15. కోస్టల్ షిప్పింగ్ బిల్లు, 2024
16. ఇండియన్ పోర్ట్స్ బిల్లు, 2024



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

# అబ్దుల్లాపూర్మెట్ పాఠశాలలో మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్.

**అబ్దుల్లాపూర్మెట్, నవంబర్ 25 ప్రజా స్వేచ్ఛ**
అబ్దుల్లాపూర్మెట్ పాఠశాలలో మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్, చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మరియు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి పరీక్ష పేపర్ను రిలీజ్ చేస్తున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అబ్దుల్లాపూర్మెట్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రమేష్ సార్ మరియు మండల ఉపాధ్యాయ బృందం.ఈ సందర్భంగా పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల స్థాయిలో పోటీ పరీక్షల్లో పాల్గొంటే భవిష్యత్‌లో పోటీ పరీక్షలపై భయం ఉండదని తెలియజేశారు. ఈ పరీక్షా పత్రంలో 8,9 మరియు 10 తరగతికి సంబంధించిన విజ్ఞాన శాస్త్ర అంశాలలో బహుళైచ్ఛిక ప్రశ్నలు ఉంటాయి. దీని కొరకు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రూ.5లు ఫీజు, ప్రైవేటు పాఠశల విద్యార్థులకు రూ.10లు ఫీజు కట్టవలసి ఉంటుంది. పాఠశాల స్థాయిలో మొదట






పరీక్ష జరుతుతుంది. వివిధ పాఠశాలలలోని విజేతలందరకూ మండల స్థాయిలో పరీక్ష నిర్వహిస్తారు. మండల స్థాయిలోని విజేతలకు జిల్లా స్థాయిలో పరీక్ష నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతలందరకు రాష్ట్రస్థాయిలో పరీక్ష ఉంటుంది. ఈ కార్యక్రమంలో ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి భువనేశ్వరి జిల్లా వాయిస్ ఆఫ్ తెలంగాణ కన్వీనర్ వెంకటేష్, భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయులు ఏర్రయ, నవీన్, రజిని, మండల నాయకులు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించేందుకే చెకుముకి టెస్ట్,... ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మండల ప్రధాన కార్యదర్శి మహిపాల్ కరంటోత్... చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ అనేది విద్యార్థులకు సైన్స్ పై అవగాహన మరియు వారి ఆచరణాత్మక శాస్త్రీయ పరిజ్ఞానాన్ని సవాలు చేసే పోటీ అని తెలియజేశారు.

# రూ. 4 వేల పెన్షన్‌కు ముహూర్తం ఖరారు?
## తెలంగాణ ప్రభుత్వం కసరత్తు..!!

**ప్రజా స్వేచ్ఛ**
తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ప్రధాన కారణాల్లో ఆరు గ్యారంటీలు ప్రధాన కారణమని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఉచిత బస్సు మొదలు రైతు భరోసా, ఆసరా పింఛన్ల పెంపు వరకు ఇలా ప్రజలను ఆకట్టుకునే పథకాలతో కాంగ్రెస్ ప్రజల్లోకి వెళ్లింది. మరీ ముఖ్యంగా ఆసర పింఛన్ల పెంపునకు సంబంధించి ప్రజలు బాగా అట్రాక్ట్ అయ్యారని చెప్పొచ్చు. ఇప్పటికే ఆరు గ్యారెంటీల్లో ఉచిత బస్సు, సిలిండర్‌పై సబ్సిడీ వంటి గ్యారెంటీలను ప్రభుత్వం అమలు చేసింది. అయితే తాజాగా మరో రెండు పథకాలను అమలు చేసేందుకు రేవంత్ సర్కార్ అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఆసరా పింఛన్ పెంపుతో పాటు రైతు భరోసాపై త్వరలోనే ప్రకటన వచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తోన్న నేపథ్యంలో ఇంకా పింఛన్ల పెంపు లేకపోవడంతో ప్రజల్లో కొంత అసంతృప్తి ఉన్నట్లు పార్టీలో చర్చ సాగుతోంది తాజాగా నిర్వహించిన కులగణన సర్వేలో కూడా ఇదే విషయం స్పష్టమైనట్లు తెలుస్తోంది. ఎన్యూమరేటర్లను ప్రజలు పింఛన్ విషయమై ప్రస్తావిస్తున్నట్లు ప్రభుత్వానికి ఫీడ్ బ్యాక్ అందింది. దీంతో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ అంశం కాంగ్రెస్‌కు ఇబ్బందిగా మారే అవకాశాలు ఉన్నట్లు భావిస్తోందని సమాచారం. ఇందులో భాగంగానే రూ. 2 వేలు ఉన్న పెన్షన్‌ను రూ. 4వేలకు, దివ్యాంగులకు రూ. 4 వేలుగా ఉన్న పెన్షన్‌ను రూ. 6 వేలకే పెంచేందుకు ప్రభుత్వం కసరత్తులు చేస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే ఎన్నికల్లోపే పింఛన్ పెంపుతో పాటు, రైతు భరోసా పథకాలను అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. వృద్ధాప్య పింఛన్‌తో పాటు బీడీ కార్మికులకు పింఛన్ పెంచడం, రైతు భరోసా అందించడంతో అటు మహిళలు, ఇటు రైతుల నుంచి తమకు పాజిటివ్ రెస్పాన్స్ వస్తుందని కాంగ్రెస్ పెద్దలు లెక్కలు వేసుకుంటున్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల తర్వాత ఇందుకు సంబంధించి అధికారిక ప్రకటన వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇదిలా ఉంటే.. రైతు భరోసాకు సంబంధించి అసెంబ్లీ సమావేశాల్లో ప్రత్యేకంగా చర్చించాలని ప్రభుత్వం






తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

భావిస్తోంది. ఎన్ని ఎకరాల వరకు భరోసా ఇవ్వాలనే దానిపై ప్రభుత్వం సభలో అభిప్రాయాన్ని సేకరించాలని భావిస్తోంది. ఇప్పటికే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం అన్ని జిల్లాల్లో పర్యటించి, రైతులు, రైతు సంఘాలు, ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించిన విషయం తెలిసిందే. ఈ వివరాలతో పాటు అసెంబ్లీలో రాజకీయ పార్టీల అభిప్రాయాలను తీసుకున్న తర్వాత ఈ పథకానికి సంబంధించి విధివిధానాలను ప్రకటించాలని చూస్తోంది.

## బిజినెస్

# స్టాక్ మార్కెట్‌లో జోష్..
# మళ్లీ 80వేలు దాటిన సెన్సెక్స్..

## ఇండ్ల రుణాల వడ్డీపై ఆదాయం పన్ను మినహాయించాలి.

### కేంద్రానికి క్రెడాయ్ అప్పీల్..!



అపార్డబుల్ హౌసింగ్ అనే పదానికి నిర్వచనం సవరించాలని కేంద్రాన్ని ప్రముఖ రియాల్టీ డెవలపర్ల సంస్థ - కాన్ఫిడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్) కోరింది. రోజురోజుకు అపార్డబుల్ హౌసింగ్‌కు గిరాకీ పెరుగుతున్న నేపథ్యంలో ఇండ్ల రుణాలపై వడ్డీ చెల్లింపులకు పన్ను పూర్తిగా మాఫీ చేయాలని కోరింది. ప్రస్తుతం ఆదాయం పన్ను చట్టం కింద ఇంటి రుణాలు తీసుకున్నవారు రుణాలపై రూ.2 లక్షల వడ్డీ చెల్లింపుపై ఆదాయం పన్ను మినహాయింపు లభిస్తుంది. కానీ మొత్తం వడ్డీ చెల్లింపునకు ఆదాయం పన్ను రాయితీ కల్పించాలని క్రెడాయ్ ప్రెసిడెంట్ బొమన్ ఇరానీ అభ్యర్థించారు.క్రెడాయ్ 25వ వార్షికోత్సవం సందర్భంగా రూ.45 లక్షల్లోపు అపార్డబుల్ హౌసింగ్ అన్న నిర్వచనాన్ని రూ.75-80 లక్షలకు సవరించాలని కోరారు. అలాగే రూ.75-80 లక్షల్లోపు విలువ గల నిర్మాణంలో ఉన్న ఇండ్ల నిర్మాణాలపై జీఎస్టీ ఒకశాతానికి పరిమితం చేయాలని అభ్యర్థించారు. ఇప్పుడు రూ.45 లక్షల్లోపు విలువ గల ఇండ్ల నిర్మాణంపై జీఎస్టీ ఒక్క శాతం ఉంది. రూ.45 లక్షలపై చిలుకు విలువ గల నిర్మాణంలోని ఇండ్లపై ఐదుశాతం జీఎస్టీ వర్తిస్తుంది. దీనిపై డెవలపర్లు ఇన్ పుట్ టాక్స్ క్రెడిట్ క్లయిమ్ చేసుకునేందుకు నిబంధనలు అనుమతించడం లేదు. 2017లో అపార్డబుల్ హౌసింగ్ అంటే రూ.45 లక్షల్లోపు విలువ గల ఇల్లు అని నిర్ణయించారు. కానీ 2017 నుంచి పెరిగిన వార్షిక ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకున్నా, ఈ పరిమితిని రూ.75-80 లక్షలకు పెంచాలని బొమన్ ఇరానీ కోరారు. జీఎస్టీ తగ్గించడంతోపాటు అపార్డబుల్ హౌసింగ్ నిర్వచనాన్ని సవరిస్తే ఇండ్ల కొనుగోలుదారులు లబ్ధి పొందుతారని పేర్కొన్నారు. ఇక ఇండ్ల నిర్మాణ అనుమతులకు 12 నుంచి 18 నెలల వరకూ టైం పడుతుందని, వేగంగా అనుమతులు ఇచ్చేలా చూడాలని అభ్యర్థించారు.


దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండోరోజు లాభాల్లో ముగిశాయి. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో సూచీలు పుంజుకున్నాయి. ఉదయం సెన్సెక్స్ వెయ్యి పాయింట్లకుపైగా లాభాల్లో మొదలైంది. నిఫ్టీ సైతం 300 పాయింట్లకుపైగా లాభంతో ప్రారంభం కాగా.. చివరి వరకు అదే ఊపును కొనసాగించాయి. సెన్సెక్స్ క్రితం సెషన్‌తో పోలిస్తే 80,193.47 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 79,765.99 పాయింట్ల కనిష్ఠానికి చేరిన సెన్సెక్స్.. అత్యధికంగా 80,473.08 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 992.74 పాయింట్లపైగా 80,109.85 వద్ద ముగిసింది.నిఫ్టీ 314.65 పాయింట్ల లాభంతో 24,221.90 వద్ద స్థిరపడింది. దాదాపు 2,541 షేర్లు పురోగమించగా.. 1347 షేర్లు క్షీణించాయి. నిఫ్టీలో ఓఎన్‌జీసీ, బీపీసీఎల్, భారత్ ఎలక్ట్రానిక్స్, ఎస్‌బీఐ, ఎల్అండ్‌టీ టాప్ గెయినర్స్ నిలువగా.. జెఎస్‌డబ్ల్యూ



స్టీల్, ఇన్ఫోసిస్, బజాజ్ ఆటో, టెక్ మహీంద్రా, ఏషియన్ పెయింట్స్ నష్టపోయాయి. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.6 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ దాదాపు 2 శాతంపెరిగాయి. ఆయిల్ అండ్ గ్యాస్, రియల్టీ, క్యాపిటల్ గూడ్స్, పీఎస్‌యూ బ్యాంక్‌లు 2-4 శాతం వృద్ధిని నమోదు చేశాయి. ఇక సోమవారం డాలర్‌కు రూపాయి 17 పైసలు పెరిగి 84.28 వద్ద ముగిసింది.

## భారీగా తగ్గిన బంగారం.. వెండి ధరలు..!

దేశ రాజధానిలో బంగారం తులం ధర సోమవారం రూ.1000 క్షీణించి రూ.79,400లకు పడిపోయింది. 99.5 శాతం స్వచ్ఛత గల బంగారం తులం ధర రూ.1000 తగ్గి రూ.79,000లకు చేరుకుంది. మరోవైపు కిలో వెండి ధర రూ.1600 పతనమై రూ.91,700 వద్ద స్థిర పడింది. శుక్రవారం తులం బంగారం (24 క్యారట్స్) ధర రూ.80,400 వద్ద ముగిసింది. కిలో వెండి ధర రూ.93,300 పలికింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో డిసెంబర్ డెలివరీ బంగారం తులం ధర రూ.1071 తగ్గి రూ.76,545లకు చేరుకున్నది. కిలో వెండి ధర డిసెంబర్ డెలివరీ ధర రూ.1,468 పతనమై రూ.89,300 వద్ద ముగిసింది. అంతర్జాతీయంగా కామెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్‌లో ఔన్స్ బంగారం ధర 40.80 డాలర్లు పతనమై



# ఆస్ట్రేలియాపై టీమిండియా ఘన విజయం

## స్పోర్ట్స్

### 295 పరుగుల తేడాతో భారీ విజయం

అయిదు టెస్టుల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని భారత్ ఘనంగా ఆరంభించింది. పెర్త్ వేదికగా జరిగిన తొలి టెస్టులో ఆస్ట్రేలియాపై 295 పరుగుల తేడాతో భారీ విజయం సాధించింది. వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ రేసులో నిలవాలంటే ఈ సిరీస్‌ను తప్పక గెలవాల్సిన పరిస్థితిలో ఆరంభ పోరులో దుమ్మురేపింది. ఆల్‌రౌండ్ షోతో కంగారూలను కంగారు పెట్టించింది. న్యూజిలాండ్ చేతిలో వైట్‌వాస్ పరాజయాన్ని మరిచి చిరస్మరణీయ విజయాన్ని అందుకుంది. 534 పరుగుల కొండంత లక్ష్యంతో ఛేదనకు దిగిన ఆస్ట్రేలియా 58.4 ఓవర్లలో 238 పరుగులకు కుప్పకూలింది. ట్రావిస్ హెడ్ (89బీ 101 బంతుల్లో, 8 ఫోర్లు), మిచెల్ మార్ష్ (47బీ 67 బంతుల్లో, 3 ఫోర్లు, 2 సిక్సర్లు), అలెక్స్ కేరీ (36బీ 58 బంతుల్లో, 2 ఫోర్లు) పోరాటంతో ఆసీస్ గౌరవంగా ఓడింది. లేదంటే రికార్డు ఓటములు చవిచూసేది. భారత బౌలర్లలో మహ్మద్ సిరాజ్, జస్‌ప్రీత్ బుమ్రా మూడు



వికెట్లతో విజృంభించారు. వాషింగ్టన్ సుందర్ రెండు, నితీశ్ రెడ్డి, హర్షిత్ రాణా ఒక్క వికెట్ పడగొట్టారు. ఓవర్‌నైట్ స్కోరు 12/3తో నాలుగో రోజు ఆట ఆరంభించిన ఆస్ట్రేలియాను సిరాజ్ ఆదిలోనే దెబ్బకొట్టాడు. ఉస్మాన్ ఖవాజా (4బీ 13 బంతుల్లో)ను పెవిలియన్‌కు చేర్చాడు. తన తొలి ఓవర్ మూడో బంతికే ఉస్మాన్ ఖవాజా (4బీ 13 బంతుల్లో) బోల్తాకొట్టించాడు. టెస్టుల్లో ఖవాజాను సిరాజ్ ఔట్ చేయడం ఇది మూడో సారి. ఆసీస్ ఓపెనర్ ఖవాజాకు 81 బంతులు సంధించిన సిరాజ్ 31 పరుగులిచ్చి మూడు సార్లు పెవిలియన్‌కు చేర్చాడు. ఆ తర్వాత డేంజర్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ (17బీ 60 బంతుల్లో)ను సిరాజ్ ఔట్ చేశాడు. స్టన్నింగ్ డెలివరీతో కుదురుకున్న స్మిత్‌ను సిరాజ్ బోల్తాకొట్టించాడు. దీంతో ట్రావిస్ హెడ్- స్మిత్ 62 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. అయితే భారత్ విజయాన్ని ట్రావిస్ హెడ్-మిచెల్ మార్ష్ కాస్త ఆలస్యం చేశారు. వీరిద్దరు ఆరో వికెట్‌కు 87 బంతుల్లో 82 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. అయితే హెడ్‌ను బుమ్రా, మార్ష్‌ను నితీశ్ రెడ్డి ఔట్ చేయడంతో ఆసీస్ పతనం ఖరారైంది. అలెక్స్ కేరీ పోరాటం ఓటమి అంతరాన్ని మాత్రమే తగ్గించింది. యశస్వీ జైస్వాల్ (161బీ 297 బంతుల్లో, 15 ఫోర్లు, 3 సిక్సర్లు), విరాట్ కోహ్లి (100 నాటౌట్‌బీ 143 బంతుల్లో, 8 ఫోర్లు, 2 సిక్సర్లు) శతకాల మోత మోగించడంతో రెండో ఇన్నింగ్స్‌ను భారత్ 487/6 స్కోరు వద్ద డిక్లేర్ చేసిన సంగతి తెలిసిందే. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 150, ఆసీస్ 104 పరుగులకే పరిమితమైంది.

## ఆర్‌సీబీలోకి భువనేశ్వర్ కుమార్



టీమిండియా వెటరన్ పేసర్, స్వింగ్ కింగ్ భువనేశ్వర్ కుమార్‌ను రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కొనుగోలు చేసింది. ముంబై ఇండియన్స్, లక్నో సూపర్ జెయింట్స్‌తో పోటీ పడి మరి రూ. 10.75 కోట్ల భారీ ధరకు దక్కించుకుంది. రూ.2 కోట్ల కనీస ధరతో వేలంలోకి వచ్చిన ఈ వెటరన్ పేసర్ కోసం లక్నో సూపర్ జెయింట్స్, ముంబై ఇండియన్స్ తీవ్రంగా పోటీపడ్డాయి. ముంబై ఓనర్ ఆకాశ్ అంబానీ, లక్నో ఓనర్ సంజీవ్ గోయెంకా తగ్గేదేలే అన్నట్లు బిడ్ వేసారు. దాంతో భువనేశ్వర్ కుమార్ ధర అమాంతం రూ. 10 కోట్లకు చేరింది. రూ. 10.50 కోట్లకు లక్నో ఆఖరి బిడ్ వేయగా.. ముంబై తప్పుకుంది. లక్నో ఖాయమనే సమయంలో ఎంట్రీ ఇచ్చిన ఆర్‌సీబీ.. రూ. 10.75 కోట్లకు సొంతం చేసుకుంది. ఆఖరి వరకు వేచి చూసిన ఆర్‌సీబీ తెలివిగా వ్యవహరించి సొంతం చేసుకుంది. గత సీజన్ వరకు సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ప్రాతినిథ్యం వహించిన భువనేశ్వర్ కుమార్.. 176 మ్యాచ్‌లు ఆడి 181 వికెట్లు తీసాడు. 2011 నుంచి ఐపీఎల్ ఆడుతున్న భువీకి అపారమైన అనుభవం ఉంది. నకుల్ బాల్స్, యార్కర్లు, స్లోయర్ బాల్స్ వేయడంలో భువనేశ్వర్ కుమార్ స్పెషలిస్ట్. డెత్, పవర్ ప్లే బౌలింగ్ స్పెషలిస్ట్‌గా టీమిండియాతో పాటు సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు భువీ ఎన్నో విజయాలు అందించాడు. బెంగళూరు హోమ్ గ్రౌండ్ చిన్నస్వామి స్టేడియానికి భువనేశ్వర్ కుమార్ బౌలింగ్ సరిగ్గా సరిపోతుంది. చిన్నమైదానంలో భువీ స్లో బౌలింగ్ పరుగులు కట్టడి చేయడానికి ఉపయోగపడనుంది. ఈ క్రమంలోనే భువీ కోసం ఆర్‌సీబీ భారీ ధర చెల్లించింది. భువనేశ్వర్ కుమార్‌ను కొనుగోలు చేయడంపై ఆర్‌సీబీ ఫ్యాన్స్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్‌సీబీ కొనుగోలు చేసిన ఆటగాళ్లు: జోష్ హేజిల్‌వుడ్ (రూ. 12.50 కోట్లు), ఫిల్ సాల్ట్ (రూ. 11.50 కోట్లు), జితేశ్ శర్మ (రూ. 11 కోట్లు), లివింగ్‌స్టన్ (రూ. 8.75 కోట్లు), రసిక్ సలాం (రూ. 6 కోట్లు), సుయాష్ శర్మ (రూ. 2.60 కోట్లు), కృనాల్ పాండ్యా(రూ.5.75 కోట్లు), భువనేశ్వర్ కుమార్(రూ.10.75 కోట్లు)

# కేన్ విలియమ్సన్ పై ఆసక్తి చూపని సన్ రైజర్స్

ఇండియన్ ప్రీమియర్ లీగ్ సీజన్ 2025, 18వ ఎడిషన్ రెండో రోజు మెగా ఆక్షన్ రసవత్తరంగా సాగుతోంది. ఐపీఎల్ ఆడే మొత్తం 10 ఫ్రాంఛైజీలు ఇందులో పాల్గొన్నాయి. 577 మంది ప్లేయర్లల్లో తమకు కావాల్సిన గెలుపు గుర్రాల కోసం పోటీ పడుతోన్నాయి.న్యూజిలాండ్ మాజీ కేప్టెన్, అన్ని ఫార్మట్లల్లో ఫిట్ అనిపించుకోగల కెపాసిటీ ఉన్న కేన్ విలియమ్సన్ అమ్ముడు పోలేదు. రెండో రోజు తొలి రౌండ్‌లో అతన్ని కొనుగోలు చేయడానికి ఏ ఫ్రాంఛైజీ కూడా ముందుకు రాలేదు. సుదీర్ఘకాలం అతన్ని అట్టి పెట్టుకున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ సహా ఏ టీమ్ మేనేజ్‌మెంట్ కూడా ఆసక్తి చూపలేదు.ఐపీఎల్‌లో సుదీర్ఘకాలంగా ఆడుతున్న అనుభవం ఉంది కేన్ విలియమ్సన్‌కు. 2015లో గ్రాండ్ ఎంట్రీ ఇచ్చాడు. 2024 వరకూ కొనసాగాడు. మొత్తంగా 79




మ్యాచ్‌లల్లో 2,128 పరుగులు చేశాడు. ఇందులో 18 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. అతని వ్యక్తిగత అత్యధిక స్కోరు 64. 125.62 స్ట్రైక్‌రేట్‌ను నమోదు చేశాడు. బ్యాటింగ్ సగటు 35.47. ఇంత మంచి ట్రాక్ రికార్డ్ ఉన్నప్పటికీ కేన్ విలియమ్సన్‌పై బెట్ వేయడానికి ఏ ఫ్రాంఛైజీ ముందుకు రాలేకపోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ ఏడాది గుజరాత్ టైటాన్స్ తరఫున రెండు మ్యాచ్‌లే ఆడాడు. గాయం వల్ల సీజన్ నుంచి అర్ధాంతరంగా తప్పుకోవాల్సి వచ్చింది. కేన్‌తో పాటు అంతర్జాతీయ మ్యాచ్‌లల్లో సత్తా చాటుతున్న పలువురు ప్లేయర్లు అన్ సోల్డ్‌గా మిగిలిపోయారు తొలి రౌండ్‌లో. అజింక్య రహానె, న్యూజిలాండ్‌కు చెందిన గ్లెన్ ఫిలిప్స్, దక్షిణాఫ్రికా స్పిన్ బౌలర్ కేశవ్ మహరాజ్, శార్దుల్ ఠాకూర్, మయాంక్ అగర్వాల్‌ను ఎవరూ తీసుకోలేదు. బిడ్డింగ్స్ వేయలేదు. మలి దఫాలో వీరిలో ఎవరికి ఛాన్స్ దక్కుతుందనేది వేచి చూడాలి.



# సౌత్ సర్కిల్స్‌లో మోస్ట్ హ్యాపెనింగ్ బ్యూటీ మీనాక్షి

ప్రజెంట్ సౌత్ సర్కిల్స్‌లో మోస్ట్ హ్యాపెనింగ్ బ్యూటీ మీనాక్షి చౌదరి. చిన్న సినిమాలతో కెరీర్ స్టార్ట్ చేసిన ఈ భామ ఇప్పుడు టాప్ హీరోలతో జోడీ కడుతూ స్టార్ లీగ్‌లోకి ఎంటర్ అవుతున్నారు. అదే సమయంలో వరుస సినిమాలతో మోస్ట్ బిజియస్ట్ హీరోయిన్‌గానూ పేరు తెచ్చుకుంటున్నారు. అందుకే ఈ బ్యూటీ మీద రూమర్స్ కూడా గట్టిగానే వైరల్ అవుతున్నాయి.తెలుగులో మహేష్ బాబు, తమిళ్‌లో విజయ్ సినిమాల్లో ఛాన్స్ రావటం అంటే ఏ హీరోయిన్‌కైనా ఓ కల. అలాంటి కల కెరీర్ ఎర్లీ డేస్‌లోనూ నిజం చేసుకున్నారు హ్యాపెనింగ్ బ్యూటీ మీనాక్షి చౌదరి. మహేష్ గుంటూరు కారం సినిమాలో కీలక పాత్రలో నటించిన ఈ బ్యూటీ, విజయ్ ది గోట్‌లోనూ హీరోయిన్‌గా ఆకట్టుకున్నారు.. రీసెంట్‌గా వరుణ్ తేజ్ మట్కా, దుల్కర్ సల్మాన్ లక్కీ భాస్కర్ సినిమాలతో ఆడియన్స్ ముందుకు వచ్చిన ఈ బ్యూటీ..త్వరలో విశ్వక్ సేన్ మెకానిక్ రాఖీ సినిమాలో కనిపించబోతున్నారు. ప్రజెంట్ సెట్స్ మీద ఉన్న సంక్రాంతి వస్తున్నాంలో వెంకటేష్‌కు జోడీగా నటిస్తున్నారు. ఇంత బిజీగా ఉన్న టైమ్‌లో ఈ బ్యూటీ పెళ్లి చేసుకోబోతున్నారన్న న్యూస్ వైరల్ అవుతోంది. తన తొలి తెలుగు సినిమా హీరో సుశాంత్‌ను మీనాక్షి పెళ్లి చేసుకోబుతున్నారన్న న్యూస్ చాలా రోజులుగా వైరల్ అవుతోంది. తాజాగా ఈ వార్తలపై క్లారిటీ ఇచ్చారు ఈ బ్యూటీ. తాను ఎవరినీ పెళ్లి చేసుకోవటం లేదని, అసలు ఇప్పట్లో పెళ్లి చేసుకునే ఉద్దేశమే తనకు లేదని తేల్చేశారు. దీంతో మీనాక్షి పెళ్లి వార్తలకు ఫుల్‌స్టాప్ పడింది. ప్రస్తుతం మీనాక్షి మూడు సినిమాలతో బిజీగా ఉన్నారు. మరికొన్ని సినిమాలు డిస్కషన్ స్టేజ్‌లో ఉన్నాయి. ఇన్ని సినిమాలకు ఏ మాత్రం ప్రాబ్లమ్ లేకుండా డేట్స్ అడ్జస్ట్ చేస్తూ జెట్ స్పీడుతో దూసుకుపోతున్నారు ఈ బ్యూటీ. దీంతో త్వరలోనే మీనాక్షి టాలీవుడ్ నెంబర్ వన్ హీరోయిన్ రేసులో కనిపించే ఛాన్స్ ఉందంటున్నారు విశ్లేషకులు.



# భక్తకన్నప్ప రిలీజ్ అప్పుడే...?

టాలీవుడ్ యాక్టర్ మంచు విష్ణు టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం కన్నప్ప. బాలీవుడ్ డైరెక్టర్ ముఖేశ్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ చిత్రంలో కలెక్షన్ కింగ్ మోహన్ బాబు, గ్లోబల్ స్టార్ ప్రభాస్, మోహన్ లాల్, నయనతార, మధుబాల, శరత్‌కుమార్, శివరాజ్‌కుమార్, ఐశ్వర్య కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే ఆయా పాత్రలకు సంబంధించిన లుక్స్ విడుదల చేయగా.. నెట్టింట వైరల్ అవుతున్నాయి. తాజాగా సినిమా విడుదల తేదీని ప్రకటించారు మేకర్స్. లార్డ్ శివ అపర భక్తుడు కన్నప్ప చిత్రాన్ని 2025 ఏప్రిల్ 25న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు. ప్రభాస్-మారుతి కాంబినేషన్‌లో వస్తోన్న రాజాసాబ్ ఏప్రిల్ 10న విడుదల కానున్న విషయం తెలిసిందే. ఈ లెక్కన ఏప్రిల్‌లో రెండు సినిమాల మధ్య పోరు ఎలా ఉంటుందనేది ఆసక్తిగా మారింది. ఇప్పటికే కన్నప్ప నుంచి లాంచ్ చేసిన టీజర్, పోస్టర్లు నెట్టింట చక్కర్లు కొడుతూ.. సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తున్నాయి. కన్నప్ప నుంచి షేర్ చేసిన తిన్నడు, ముండడు, చండుడు, మారెమ్మ, పిలక-గిలక పాత్ర సోషల్ మీడియాలో రౌండప్ చేస్తున్నాయి. కన్నప్పలో బాలీవుడ్ యాక్టర్ అక్షయ్‌కుమార్ శివుడిగా నటిస్తున్నాడు. ఈ చిత్రానికి మెలోడీ బ్రహ్మ మణిశర్మ, స్టీఫెన్ దేవసి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నారు. ఈ మూవీని 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ, బ్యానర్లపై సంయుక్తంగా తెరకెక్కిస్తుండగా.. పరుచూరి గోపాలకృష్ణ, బుర్రా సాయిమాధవ్, తోట ప్రసాద్ స్క్రీన్‌ప్లే అందిస్తున్నారు. మంచు విష్ణు తొలి పాన్ ఇండియా సినిమా కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి.

# తననెవరో అందరికీ తెలుసు..

## రిలేషన్‌షిప్‌పై రష్మిక మందన్న



టాలీవుడ్‌లో మోస్ట్ క్రేజీయెస్ట్ కాంబోలో టాప్‌లో ఉంటుంది విజయ్ దేవరకొండ -రష్మిక మందన్నా. గీతగోవిందం, డియర్ కామ్రేడ్ సినిమాలతో సిల్వర్ స్క్రీన్‌పై మెరిసిన ఈ ఇద్దరు ఆఫ్ స్క్రీన్‌లో కూడా సూపర్ బాండింగ్ మెయింటైన్ చేస్తుంటారని తెలిసిందే. ఎప్పటికప్పుడు కలిసి కనిపిస్తూ నెట్టింట హాట్ టాపిక్‌గా నిలుస్తుంటారు. ఈ ఇద్దరు రిలేషన్‌షిప్‌లో ఉన్నారని చాలా కాలంగా నెట్టింట చర్చ నడుస్తుంది. అయితే దీనిపై మాత్రం అటు రష్మికకానీ, ఇటు విజయ్ దేవరకొండ కానీ సస్పెన్స్ మెయింటైన్ చేస్తూ వస్తున్నారు. అభిమానుల్లో నెలకొన్న డైలామాకు రష్మిక మందన్నా చెక్ పెట్టేసింది. చెన్నైలో జరిగిన పుష్ప 2 వేడుకలో తన రిలేషన్ షిప్ స్టేటస్‌పై ఓపెన్ అయిపోయింది కన్నడ సోయగం. మీకు ఇష్టమైన వ్యక్తి ఎవరు..? అతడు ఇండస్ట్రీ చెందిన వాడేనా..? అని యాంకర్ అని అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. అతడెవరో అందరికీ తెలుసునని చెప్పింది. రష్మిక సమాధానంతో ఆడిటోరియం అంతా అరుపులు,కేకలతో దద్దరిల్లిపోయింది. విజయ్ దేవరకొండతో ఉన్న రిలేషన్‌షిప్‌పై చాలా కాలంగా నెలకొన్న సస్పెన్స్‌కు తాజా కామెంట్స్‌తో ఫుల్ స్టాప్ పెట్టేసింది రష్మికమందన్నా. మరోవైపు ఇటీవలే తాను డేటింగ్‌లో ఉన్నానని, ఇప్పుడు తన వయస్సు 35 ఏండ్లు. ఇంకా సింగిల్‌గా ఉండమంటారా..? అందరం ఏదో ఒకటైంలో పెళ్లి చేసుకోవాల్సిందే..అంటూ రిలేషన్‌షిప్ గురించి హింట్ ఇచ్చేశాడు విజయ్ దేవరకొండ. ఈ లెక్కన త్వరలోనే విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నా పెండ్లిపై క్లారిటీ వచ్చే అవకాశాలు లేకపోలేదంటున్నారు సినీ జనాలు.



# నేనంటే తనకు అస్సలు పడదు

## - అషికా రంగనాథ్

అందం, అభినయ సామర్థ్యం రెండూ దండిగా ఉన్న కథానాయిక అషికా రంగనాథ్. కలిసొచ్చే అదృష్టం కోసం కళ్లలో దీపాలు పెట్టుకొని మరీ ఎదురు చూస్తున్నది ఈ కన్నడ కస్తూరి. సిద్ధార్థ్‌కి జోడీగా ఈ అందాలభామ నటించిన 'మిస్ యు' సినిమా ఈ నెల 29న విడుదల కానుంది. ఎన్.రాజశేఖర్ దర్శకత్వంలో సామ్యూల్ నిర్మించిన ఈ చిత్రంపై అషికా ఎంతో ఆశ పెట్టుకున్నది. ఇటీవల ఈ సినిమా గురించి తను మాట్లాడుతూ 'ఇందులో నా పేరు సుబ్బులక్ష్మి. సిద్ధార్థ్ పేరు వాసుదేవ్. నేనంటే తనకు అస్సలు పడదు. కానీ.. అనుకోకుండా నా ప్రేమలో పడిపోతాడు. కారణం ఏంటో తెరపైనే చూడాలి.' అంటూ చెప్పుకొచ్చింది అషికా రంగనాథ్. ఇంకా మాట్లాడుతూ 'నేను ఎలాంటి పాత్రలనైతే ఇష్టపడతానో.. అలాంటి పాత్ర సుబ్బులక్ష్మి. తను ఇన్నోసెంట్. పక్కా ట్రెడిషనల్. ఓ విధంగా ఇది సుబ్బులక్ష్మి కథే. ఇంతటి మంచి పాత్ర ఇచ్చిన దర్శకుడు రాజశేఖర్‌కీ, హీరో సిద్ధార్థ్‌కీ థ్యాంక్స్ చెప్పుకుంటున్నా' అని తెలిపింది అషికా.

Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492